బాలల బొమ్మల

# పరమానందయ్య శిష్యుల కథ



పరమానందయ్య శిష్యుల కథ

ధర : 50/-

పేజ్ మేకింగ్:
సరస్వతి గ్రాఫిక్స్
విజయవాడ

ప్రథమ ముద్రణ:
ఫిబ్రవరి 2009

ముద్రణ:
రమణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ

ముఖచిత్రం:
రమణ

పబ్లిషర్స్:
**సరస్వతి పబ్లికేషన్**
కాజా వెంకటేశ్వరరావు వీధి,
అరండల్ పేట, సహారా బ్యాంక్ ఎదుట,
విజయవాడ - 2

PARAMANANDAIAH SISHULA KATHA

D.T.P. by
SARASWATHI Graphics
VIJAYAWADA

First Edition:
February 2009

Printed at:
Ramana Offset Printers
VIJAYAWADA

Cover page:
Ramana

Publishers:
SARASWATHI PUBLICATION
Kaza Venkateswara Rao Street,
Arundelpet, Opp. Sahara Bank,
VIJAYAWADA - 2


ఈ పుస్తకం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అయినా పొరపాట్లు దొర్లి ఉండవచ్చును. మాకు తెలిపిన మలిముద్రణలో సవరించగలము

# పరమానందయ్య శిష్యుల కథ



## సరస్వతి పబ్లికేషన్


కాజా వెంకటేశ్వరరావు వీధి, అరండల్ పేట,
సహారా బ్యాంక్ ఎదుట, విజయవాడ -2.

## విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | కథా ప్రారంభము | ...... | 5 |
| 2. | చంద్రసేనుడి వృత్తాంతం | ...... | 8 |
| 3. | గాడిద గుడ్డు | ...... | 12 |
| 4. | మంగయ్య మండపేట ప్రయాణం | ...... | 14 |
| 5. | కార్తీక మాస వనభోజనాలు | ...... | 16 |
| 6. | గురువుగారి అశ్వవాహనం | ...... | 21 |
| 7. | పరమానందయ్య శిష్యుల తర్కశాస్త్ర ప్రతిభ | ...... | 25 |
| 8. | సున్నిత సంభాషణం | ...... | 27 |
| 9. | తప్పిపోయిన పెళ్ళి | ...... | 29 |
| 10. | ఏరుతో వివాదం | ...... | 32 |
| 11. | పరమానందయ్యశిష్యుల గణిత పాండిత్యం | ...... | 35 |
| 12. | పరమానందయ్య శిష్యులు - జ్యోతిష్య బాధలు | ...... | 38 |
| 13. | కిష్కింధాకాండ | ...... | 41 |
| 14. | ఒక ఆజ్ఞ - నాలుగు కార్యాలు | ...... | 44 |
| 15. | పరమానందయ్య శిష్యుల ప్రత్యక్ష పురాణం | ...... | 47 |
| 16. | అరిసెలతో ఆత్మహత్య | ...... | 48 |
| 17. | పాదసేవ పోటీలు | ...... | 50 |
| 18. | ఎవరు చవట? | ...... | 52 |
| 19. | వికటించిన వైద్యం | ...... | 55 |
| 20. | ప్రయాణంలో పదనిసలు | ...... | 58 |
| 21. | గురువుగారికి తలకొరివి | ...... | 62 |
| 22. | పరమానందయ్య శిష్యుల శాపవిమోచనం | ...... | 67 |



# సరస్వతి వారి నూతన ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | వాల్మీకి రామాయణము | - 100-00 |
| 2. | అన్నమాచార్య సంకీర్తనలు | - 40-00 |

## చిల్డ్రన్ సిరీస్

| | | |
|---|---|---|
| 1. | పంచతంత్రం | - 50-00 |
| 2. | తెనాలి రామకృష్ణ కథలు | - 50-00 |
| 3. | అక్బర్, బీర్బల్ కథలు | - 50-00 |
| 4. | పిల్లల నీతి కథలు | - 50-00 |
| 5. | ఆలీబాబా నలభై దొంగలు | - 50-00 |
| 6. | బేతాళ కథలు | - 50-00 |
| 7. | అల్లా ఉద్దీన్ అద్భుత దీపం | - 50-00 |
| 8. | పరమానందయ్య శిష్యుల కథ | - 50-00 |
| 9. | తాతయ్య చెప్పిన కథలు | - 50-00 |
| 10. | భట్టి విక్రమార్క కథలు | - 50-00 |
| 11. | చందమామ కథలు | - 50-00 |
| 12. | బామ్మ చెప్పిన కథలు | - 50-00 |
| 13. | అరేబియన్ నైట్స్ | - 50-00 |

పరమానందయ్యగారి శిష్యులు మంత్రాలు చదువుతుండగా, సాక్షాత్తు మన్మథుడిలా మెరిసిపోతున్న చంద్రసేనుడు, పున్నమి చంద్రునిలా మెరిసిపోతున్న చంద్రలేఖ మెడలో మూడు ముళ్ళు వేసాడు.

సరిగ్గా అదే సమయంలో వికారంగా, హాస్యానుస్పదంగా ఉన్న పరమానందయ్యగారి శిష్యుల స్వరూపాలు, కంఠస్వరం మారిపోయాయి. వాళ్ళు ఇప్పుడు తెలివితక్కువ వాళ్ళు అయిన పిచ్చివాళ్ళు కాదు... బ్రహ్మజ్ఞానులైన మహాఋషులు.

ఆ విచిత్రాన్ని చూసిన అక్కడి ప్రజలు ఆశ్చర్యపడ్డారు. సరిగ్గా అదే సమయానికి ఇంట్లోంచి వెళ్ళిపోయిన తన శిష్యుల్ని వెదుక్కుంటూ రాజుగారి దగ్గరికి వచ్చిన పరమానందయ్యగారికి, తన శిష్యులు నిజంగా మూర్ఖులు కారని, చంద్రలేఖ అనే గంధర్వ స్త్రీ ఇచ్చిన శాపం వలన అలా మారారని తెలిసి ఆనందించారు.

ఆ తర్వాత ఆ పదమూడు మంది ఋషులు అందర్నీ ఆశీర్వదించి చివరగా పరమానందయ్యగారి దగ్గరికి వచ్చి గురుదేవా! మమ్మల్ని ఆశీర్వదించండి... అని పాదాభివందనం చేసారు.

పరమానందయ్యగారు వాళ్ళని లేవనెత్తి హృదయానికి ప్రేమగా హత్తుకుని, నాయనలారా, పరమానందయ్యగారి శిష్యులు వెర్రివెంగళప్పలు కాదు, మహాజ్ఞానులని లోకానికి నిరూపించారు. మీరు నా శిష్యులు కావటం నా పూర్వజన్మ సుకృతం అన్నారు ఆనందభాష్పాలు వర్షిస్తున్న నేత్రాలతో.





# పరమానందయ్య శిష్యుల కథ

## కథా ప్రారంభము

సాహిత్యంలో పరమానందయ్య శిష్యుల కథలకు ఒక ప్రత్యేకస్థానం ఉన్నది. పరమానందయ్య శిష్యుల తెలివి తక్కువ పనులు పిల్లల్ని, పెద్దల్ని నవ్విస్తాయి. అయితే ఎవ్వరూ, కావాలని బుద్ధిలేని పనులు చెయ్యరు. మరి ఈ పరమానందయ్య శిష్యులు ఎందుకని తెలివి లేని వాళ్ళకి ప్రతినిధులుగా నిలిచిపోయారు. వాళ్ళ తెలివిలేనితనంలో అంతర్గతంగా కనబడే అమాయకత్వమే ఈ కథలు ఆబాలగోపాలానికి ఆకర్షణీయం కావటానికి గల ప్రధాన కారణం.

పూర్వం దండకారణ్య ప్రాంతంలో శ్వేతవర్ణుడు అనే మహర్షి ఉండేవాడు. ఆయనకి గురుభక్తి పరాయణులైన 13 మంది శిష్యులుండే వారు. వాళ్ళు శేతవర్ణుడికి సకల సేవలు చేస్తూ, గురువుకి ఇష్టులుగా మారారు. వాళ్ళకి అన్ని రకాల విద్యలు నేర్పాడు శ్వేతవర్ణుడు.

వాళ్ళెంత జ్ఞానులు అయినా, ఋష్యశృంగుడిలా స్త్రీ, పురుష భేదం తెలియని నిజమైన బ్రహ్మజ్ఞానులు. వాళ్ళు ఒకసారి దండకారణ్య అడవులలో, ఒక పున్నమి రాత్రి, కొన్ని ప్రత్యేక ఆయుర్వేద శాస్త్ర మూలికలు తీసుకు రావటానికి బయలుదేరారు.

ఆయుర్వేద శాస్త్ర ప్రకారం అరణ్యంలోని కొన్ని మొక్కలు పగలు, కొన్ని రాత్రిళ్ళు మాత్రమే కనిపిస్తాయి. కొన్ని అరుదైన ఔషధ మొక్కలు పున్నమి రాత్రుళ్ళలో మిల, మిల మెరుస్తూ కనిపిస్తాయి. అలా సేకరించిన మొక్కల నుండి ఔషధాలు తయారు చేస్తారు.

శ్వేతవర్ణుడి శిష్యులు అలా పౌర్ణమి రాత్రి ఔషధ మొక్కలు సేకరిస్తూ, అడవి మధ్య ప్రాంతానికి చేరుకున్నారు. ఇది ఇలా ఉండగా, శివ వర ప్రసాదంతో పుట్టిన చంద్రలేఖ అనే గంధర్వ రాజకుమార్తె, తన స్నేహితురాళ్ళతో కలిసి, ఆకాశమార్గాన వెళుతూ, దండకారణ్య ప్రాంతానికి వచ్చింది.

వారికి ఆ ప్రాంతంలో ఉన్న ఒక సరస్సు వెన్నెలలో ప్రకాశిస్తూ కనిపించింది. ఆ సరస్సులో రాజహంసలు ఈతలు కొడుతున్నాయి. ఆ దృశ్యాన్ని చూసి, మనసు పులకించిన చంద్రలేఖ ఆ కాసారంలో జలకాలాటలు ఆడాలని నిర్ణయించుకొని, స్నేహితురాళ్ళతో సహా భూమిపై దిగారు. ఆకాశం నుండి భువికి దిగి వచ్చిన ఆ దేవకన్య చంద్రలేఖ సౌందర్యానికి, ఆ సరస్సు మరింతగా ప్రకాశించసాగింది. చంద్రలేఖ, ఆమె స్నేహితురాళ్ళు తనువుపై ఉన్న సమస్త వస్త్రాలు విడిచి, గట్టుపై పెట్టి, ఆ సరస్సులోకి దిగి జలకాలాటలు ఆడుకుంటున్నారు.

సరిగ్గా అదే సమయానికి ఔషధ మొక్కలు సేకరిస్తూ, శ్వేతవర్ణుడి శిష్యులు ఒడ్డుదాకా వచ్చారు. అలా వాళ్ళు సరస్సు దగ్గరికి వచ్చిన సమయంలో చంద్రలేఖ స్నానం ముగించి, బట్టలు ధరించటానికి ఒడ్డుకి వచ్చింది. అలా వచ్చిన చంద్రలేఖను, కళ్ళు అప్పగించి, అమాయకంగా చూస్తుండిపోయారు శ్వేతవర్ణుడి శిష్యులు.

ఆకస్మికంగా ఎదురయిన ఈ మానవుల్ని చూసి క్షణకాలం దిగ్భ్రాంతికి గురి అయిన చంద్రలేఖ, వెంటనే తేరుకుని, దిగంబరంగా ఉన్న తనని పరిశీలనగా చూస్తున్న ఆ అమాయక శిష్యుల్ని, బుద్ధిహీనులుగా జన్మించి, అజ్ఞానులుగా పేరు పొందమని శపించింది.

ఆమె శపించిన విషయం ఎక్కడో ఆశ్రమంలో ధ్యానంలో ఉన్న శేతవర్ణుడికి తెలిసి తక్షణం చంద్రలేఖ ముందు ప్రత్యక్షమై ఆగ్రహంగా



ఆమెతో ఇలా అన్నాడు. ఓసీ చంద్రలేఖా! నీటికి, పాలకి, స్త్రీకి, పురుషుడికి తేడా తెలియని పసిహృదయం గల నా శిష్యుల్ని అపార్థం చేసుకొని, బుద్ధిహీనులుగా జన్మించమని శాపం ఇచ్చావు. నీవు నా శిష్యుల కిచ్చిన శాపానికి ప్రతీకారంగా, నీవు కూడా అదే మానవుల లోకంలో జీవించి, మానవుడికి భార్యవు కావాలి.



శ్వేతవర్ణుడి శాపం విన్న చంద్రలేఖ గజ,గజ వణికి, మహర్షిని వేడుకుంది. తప్పు క్షమించి శాపాన్ని ఉపసంహరించమని కోరింది. అప్పుడు ఆ ఋషి శాంతించి, పరమ శివభక్తుడైన చంద్రవర్మని నీవు పెళ్ళాడిన మరుక్షణం నీ శాపం పోతుంది అన్నాడు. అప్పుడు చంద్రలేఖ కూడా, ఋషి శిష్యులకు, తన వివాహం కాగానే శాపవిమోచనం కల్గుతుందని చెప్పి, స్నేహితురాళ్ళతో సహా తన లోకానికి వెళ్ళిపోయింది.

ఆపై శ్వేతవర్ణుడు తన శిష్యులతో ఇలా అన్నాడు. నాయనలారా! మీకు వచ్చిన ఈ శాపానికి ఏమాత్రం విచారించకండి, మీరు కోనసీమ ప్రాంతంలో ఉన్న పరమానందయ్య అనే ఉత్తముడైన గురువుగారి దగ్గర శిష్యులుగా ఉండండి. సరిగ్గా ఒక సంవత్సరంలోగా, చంద్రలేఖకు, వివాహం జరుగుతుంది. దాంతో మీకు శాపవిమోచనం అయి, మళ్ళీ నా ఆశ్రమానికి రాగలరు.

గురువుగారు, ఇలా మాటలు పూర్తి చేసారో లేదో, ఆ మహర్షి శిష్యుల ఆకార, వికారాలు పూర్తిగా మారిపోయి, వెర్రివాళ్ళ వాలకం పొందారు. మహర్షి వాళ్ళని ఆశీర్వదించి అక్కడి నుండి అదృశ్యం అయ్యాడు.

# చంద్రసేనుడి వృత్తాంతం

రాజమహేంద్రవరాన్ని పాలించిన చంద్రసేనుడు అనే రాజు పరమ శివ భక్తుడు. ఉదయమే శివలింగాన్ని పూజించకుండా పచ్చి గంగైనా ముట్టని భక్తి తత్పరుడు. ప్రజల్ని సొంత బిడ్డల్లా అభిమానించి, వాళ్ళకి ఏ లోటు రాకుండా పాలించేవాడు.

ఆయన పేరు చేప్తే శత్రువుల గుండెల్లో గుర్రాలు పరిగెత్తేవి. అంత బల, పరాక్రమాలు కల్గిన ఈ రాజుకి ఉన్న ఒకే ఒక లోపం కల్పవల్లి అనే వేశ్యతో గల గాఢానుబంధం.

ఈ వేశ్య పేరుకే వేశ్య అయినా, గుణవంతురాలు, చక్కని రూపం గలది. సంగీత నాట్యాదులలో అందెవేసిన చెయ్యి ఆమెది. ఆమె గానంలో కోకిలకి అక్క, నాట్యంలో నెమలికి గురువు. సహజంగా రసహృదయుడు అయిన చంద్రసేనుడు కల్పవల్లికి దాసోహం అని ప్రతిరోజూ ఆమె గృహాన్ని పావనం చేసేవాడు.

ఒకసారి ఆ రాజు కల్పవల్లి ఇంటికి వెళ్ళి రాత్రంతా సంగీత, నాట్య విలాసాలలో, ఆపై శృంగార కేళిలో వోలలాడి అలసి, సొలసి ఆ రాత్రికి అక్కడే నిద్రపోయాడు.

సూర్యోదయం అవుతుండగా చంద్రసేనుడికి మెలుకువ వచ్చింది. అది తాను శివపూజ చేయాల్సిన సమయం. ఎలా, సమయం మించిపోతోంది. కనీసం ఆ శృంగార మందిరంలో శివుని పటం కూడా లేదు.

చంద్రసేనుడి హృదయం బాధతో నలిగిపోతున్నది. సరిగ్గా శివుడి కటాక్షమా అన్నట్టుగా, చంద్రసేనుడికి శివలింగం దర్శనమిచ్చింది. అంతే ఆవేశము, భక్తి అతనిలో ఉరకలేసాయి, రాత్రి శృంగార కేళి కోసం తెచ్చిన పూలలో మిగిలిన కాసిని పూలు పడక ప్రక్కనున్న బంగారు గిన్నెలో కన్పించాయి.

ఇంకే ఆలోచనా లేకుండా ఆ పూలను దోసిట్లోకి తీసుకుని శివనామాన్ని జపిస్తూ, ఆ శివలింగంపై అభిషేకించాడు. శివలింగ పూజ పూర్తి అయిన తర్వాత కానీ చంద్రసేనుడికి తెలివిరాలేదు.



తాను శివలింగం అని భ్రమించి, పూలతో పూజించింది, తన తల్పంపై ఒళ్ళు మరిచి నిద్రిస్తున్న కల్పవల్లి వల్లెవాటు ప్రక్కకి తొలగి బయటపడ్డ ఒక వక్షోజాన్ని అని తెలుసుకున్నాడు. అయినా అతడు చింతించలేదు. తన వ్రతభంగం కానందుకు చాలా సంతోషించాడు. ఆ తర్వాత కల్పవల్లి చంద్రసేనుడి ద్వారా జరిగిన విషయం తెలుసుకొని, అతని పాదాల్ని కన్నీళ్ళతో అభిషేకించింది.

కారణం కామకేళీ విలాసంలోనే కాక, శివభక్తిలో కూడా తనని మించేవారు లేరు అని నిరూపించిన చంద్రసేనుడిని తాను పొందింది. రేపు అతనికి వివాహం కావచ్చు, అప్పుడు తను పరాయిది కావచ్చు. అయినా ఈ తాత్కాలిక భాగ్యం చాలు నా జన్మ తరించింది అనుకున్నది ఆమె.

చంద్రసేన మహారాజు ఏలుబడిలో శ్రీకాకుళం నుండి వేంగీ వరకు గల ప్రాంతం ఉండేది. గోదావరీ తీరంలో ఉన్న ముక్తేశ్వరం గ్రామం కోనసీమలో ఉన్నది. ఆ కోనసీమ చంద్రసేనుడి రాజ్యంలో భాగమే.

ఇంకా ఆశ్చర్యకర అంశం చంద్రసేనుడికి విద్య నేర్పిన గురువు పరమానందయ్య గారే. అందుకే ఆయనకి, పరమానందయ్యగారిపై చాలా అభిమానం ఉండేది. అప్పుడప్పుడు చంద్రసేనుడు గురువుగారి ఆశ్రమాన్ని దర్శిస్తూ ఉండేవాడు.



ఒకరోజు చంద్రసేనుడు గోదావరి తీరంలోని అడవులలో క్రూర మృగాల్ని వేటాడుటకు వెళ్ళినపుడు, అక్కడ మానవ రూపంలో ఉండి, కొందరు ఆటవికులచే బంధించబడి ఉన్న చంద్రలేఖని చూసాడు. ఆపై చంద్రసేనుడు ఆ ఆటవికుల్ని సంహరించి చంద్రలేఖను తన రాజ్యానికి తీసుకువచ్చాడు.

ముని శాపం కారణంగా చంద్రలేఖ తానెవరో మర్చిపోయింది, పైగా మానవరూపం పొందటం వల్ల ఆమె తన మానవాతీత శక్తుల్ని కోల్పోయి

ఆటవికుల చేతికి చిక్కింది. చంద్రసేనుడు, చంద్రలేఖను తీసుకువచ్చి అంతఃపురంలో రాజమాతకు అప్పగించాడు. తన పేరు, ఊరులాంటి వివరాలు చెప్పలేకుండా ఉన్న చంద్రలేఖను ఆదరించి, దగ్గర ఉంచుకున్నది, చంద్రసేనుడి తల్లి అయిన రాజమాత.

క్రమంగా చంద్రసేనుడు, చంద్రలేఖ సౌందర్యానికి లొంగిపోయి, తన గతకాల నెచ్చెలి కల్పవల్లిని దూరంగా ఉంచసాగాడు. చంద్రలేఖ కూడా, చంద్రసేనుడి రూపానికి అతడు తన పట్ల చూపిస్తున్న ఆదరణకు పొంగి పోయి చంద్రసేనుడిపై అభిమానాన్ని పెంచుకోసాగింది.

ఇలా రెండు నెలలు గడిచాయి. చంద్రలేఖ గతాన్ని మర్చిపోయినా శివభక్తిని మర్చిపోలేదు.

ఆమె శివుడ్ని అనునిత్యం పూజిస్తూ వుండేది. అయితే ఆమెకి అర్థంకాని అంశం ఒకటే. అది, తాను ఎవరు? ఎక్కడి నుండి ఇక్కడికి వచ్చింది? ఆమెకి గుర్తున్నది రెండే పేర్లు ఒకటి శివుడు, రెండు చంద్రసేనుడు. క్రమంగా రాజమాత కూడా చంద్రలేఖని కాబోయే కోడలుగా భావించి, ఇంకా అధిక ప్రేమ చూపసాగింది ఆమెపై.

చంద్రసేనుడు క్రమంగా కల్పవల్లిని మర్చిపోయాడు. దాంతో చంద్రసేనుడి ఎడబాటు సహించలేని కల్పవల్లి, చంద్రలేఖపై అసూయ పెంచుకొని, ఎలాగైనా చంద్రలేఖని అంతఃపురం నుంచి పంపివేయాలని పంతం పట్టింది. చంద్రలేఖ అక్కడ ఉన్నంత కాలం, చంద్రసేనుడికి తను కన్పించదు. కనుక కల్పవల్లి చంద్రలేఖను ఎలా వదిలించుకోవాలా అని పథకాలు వేయసాగింది.

ఆమెకు, ఆ సమయంలో ఆసరాగా కన్పించింది రాజగురువు రత్నశర్మ. రత్నశర్మకు ఒక కుమారుడు ఉన్నాడు. అతని పేరు కామశర్మ. పూర్తిగా వ్యసనాలు వంట బట్టిన దుష్టుడు ఆ కామశర్మ. అతడు కల్పవల్లిని ఏనాడో కామించాడు.

కానీ కల్పవల్లి రాజుగారి స్నేహితురాలిగా ఆనాడు ఉన్నది కనుక ఈ కామశర్మ ఆమె వైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయలేకపోయాడు. అతడ్ని, ఈ దేశానికి రాజుగా చెయ్యాలని రత్నశర్మ చిరకాల వాంఛ.



రాజుగారికి స్త్రీ సంబంధ బలహీనతలు ఉన్నా, పరిపాలనా పరంగా సమర్థుడు కావటం వల్ల, ప్రజల్లో రాజుకి మంచి పేరు ఉండటం వల్ల అన్నిటికన్నా మించి, రాజుగారు శివభక్తి పరాయణుడు అవటం వల్ల రాజుగారిని దెబ్బ తీయటం రత్నశర్మ వల్లకాలేదు.

అందుకు తగ్గ సమయం కోసం ఎదురుచూస్తున్న రత్నశర్మకు కల్పవల్లి రూపంలో అవకాశం వచ్చింది. రత్నశర్మ, కామశర్మలు కల్పవల్లి గృహానికి వెళ్ళారు. చంద్రలేఖని ఈ లోకం నుండి బైటికి పంపే మార్గం చెప్పమన్నది కల్పవల్లి. అప్పుడు రాజగురువు ఆమెకి ఇలా సలహా ఇచ్చాడు.

"రాజుగారిని నీ మందిరానికి ఆఖరుసారిగా ఒక్కసారి వచ్చి, వెళ్ళమని కబురు చెయ్యి. అప్పుడు, రాజుగారికి నే ఇవ్వబోయే పొడిని కలిపిన పాలు ఇవ్వు, ఆ క్షణం నించే రాజు నీవాడు". నిజానికి రాజగురువు ఉద్దేశ్యం, ఆ మందు కలిపి రాజుని అంతంచేసి, కొడుక్కి ఆ రాజ్యం కట్టబెట్టాలని. రాజగురువు కొడుక్కి మాత్రం, రాజుగారు మరణిస్తే, కల్పవల్లి తనదే అవుతుందన్న నిజం తెలుసు. అందుకే రాజగురువుకి తోడుగా కల్పవల్లి ఇంటికి వచ్చాడు.

కల్పవల్లి ఒక్కసారి రమ్మని చేసిన వర్తమానం చంద్రసేనుడి హృదయాన్ని కదిలించింది. చంద్రలేఖపై తనకు ప్రస్తుతం ఎంత ప్రేమ ఉన్నా, కల్పవల్లి తన గతకాలపు ప్రేయసి.

అందువల్లే గతకాలపు అభిమానాన్ని మరువలేక కల్పవల్లి ఇంటికి వెళ్ళాడు. చంద్రసేనుడు తన ఇంటికి వచ్చేసరికి కల్పవల్లి చక్కగా ముస్తాబయి, రెండు గ్లాసుల పాలు సిద్ధంగా ఉంచింది. ఒక గ్లాసులో రాజగురువు ఇచ్చిన వశీకరణ భస్మం కలిపింది.

కానీ కల్పవల్లికి ఆ సమయంలో తెలియదు, తాను కల్పిన మందు వశీకరణానికి కాదని, రాజుగారి మరణానికి అని. చంద్రసేనుడు రాగానే, కూర్చోబెట్టి పాలు అందించింది. తర్వాత పాలు సంగతి ముందు నన్ను ఎందుకు పిలిచావో చెప్పు అన్నాడు రాజు.

మేజాబల్లపై ఉంచిన రెండు పాలగ్లాసులు ఒకే రకంగా ఉన్నాయి. పొరపాటున భస్మం కలిసిన పాలు కల్పవల్లి తాగి మరణించింది. ఆమె

మరణించబోతూ, రాజగురువు కుట్ర గురించి రాజుకి చెప్పింది. అంతా చాటు నుండి చూస్తున్న రాజగురువు, అతడి కుమారుడు, వెంటనే అక్కడి నుండి పారిపోయారు.

## గాడిద గుడ్డు

ఒకసారి పరమానందయ్యగారు శిష్యులకి అనాధ ప్రేత సంస్కారం వల్ల కోటి యజ్ఞాలు చేసిన ఫలితం వస్తుందని చెప్పారు. దాంతో వాళ్ళు ఎప్పుడైనా అనాధ శవం లభిస్తే, దానికి దహన కార్యలు చేసి, బోల్డు పుణ్యం సంపాదించుకోవాలని నిర్ణయించేసుకున్నారు. ఒకరోజు పరమానందయ్య గారు తన శిష్యుల్ని రామాపురం అనే వూరుకి ఏదో పనిమీద పంపించారు.

సరే శిష్యులు ఆ పని పూర్తి చేసుకొని, తిరిగి ఇంటికి వస్తుండగా, వాళ్ళకి వీధి ప్రక్కగా పడి ఉన్న ఒక గాడిద శవం కన్పించింది. ఆ శవాన్ని చూసిన శాస్త్రి, శర్మతో ఇలా అన్నాడు. "ఓరేయ్ శర్మా! ఈ గాడిద అనాధేనంటావా" అన్నాడు. దానికి శాస్రి ఆహా! తప్పకుండా ఈ గాడిద అనాధ గాడిదే లేకుంటే, దీని యజమాని దీనికి దహన సంస్కారాలు జరిపి, తద్దినం పెట్టకుండా ఉంటాడా అన్నాడు.

అప్పుడు శాస్త్రి, మిగిలిన శిష్యులందర్నీ పిలిచి, ఓరేయ్ అన్నలూ! మొన్న గురువుగారు అనాధప్రేతానికి దహనసంస్కారాలు చేస్తే కోటియజ్ఞాలు చేసిన ఫలం వస్తుందని చెప్పారు గుర్తుందా, అదిగో గాడిద కళేబరం, దానికి దహన సంస్కారాలు చేద్దాం.

మనకి చాలా పుణ్యం వచ్చి పడుతుంది అన్నాడు. అంత చిన్న పనికి చాలా పుణ్యం వస్తుంటే వద్దు అనటానికి పరమానందయ్యగారి శిష్యులేమైనా తెలివితక్కువ వాళ్ళా? అందుకే గాడిదకి దహన కర్మలు చేయటానికి అంగీకరించారు.

సరే గాడిద శవాన్ని, గోదావరి గట్టున తగలేస్తే, అది నేరుగా స్వర్గం వెళ్ళదూ? అని ఒక గొప్ప సలహా వదిలాడు శాస్త్రి అనే శిష్యుడు. అందరికీ ఆ సలహా నచ్చింది. సరే ఇదీ బాగానే ఉంది.



కానీ గాడిద శవాన్ని గోదావరి గట్టుదాకా ఎలా మోసుకెళ్ళాలి అన్నాడు సుబుద్ధి అనే శిష్యుడు విచారంగా. అప్పుడు శర్మ అనే శిష్యుడు ఇలా సలహా ఇచ్చాడు. మనం 13 మందిమి ఉన్నాం కనుక, దానికి ఒక తాడు కట్టి, నది గట్టుదాకా లాక్కెళదాం. శర్మ సలహా అందరికీ నచ్చింది.



వెంటనే ఊళ్ళోకి వెళ్లి ఒక కత్తి, మోకు తెచ్చాడు కామేశం అనే శిష్యుడు. ఆ మోకును గాడిదకు కట్టి, తాడు అందరూ కలిసి లాక్కుపో సాగారు. కానీ చాలా బరువుగా ఉన్న దాని శరీరాన్ని లాగలేక పోయారు వాళ్ళు. అప్పుడు సుబుద్ధి అనే శిష్యుడు, ఒక ధర్మసూక్ష్మం చెప్పాడు.

అదేమంటే శరీరంలో అతిప్రధానమైనది శిరస్సు కదా, అందుకే ఈ గాడిద తల నరికి తీసుకెళ్ళి, దానికి దహనకర్మలు చేద్దాం. ఈ ఆలోచన అందరికీ బాగా నచ్చి, గాడిద తల నరికి, మొండాన్ని అక్కడే పారేసి, తలను జాగ్రత్తగా మోసుకుపోసాగారు.

కానీ గాడిదని నరికేసరికి, దాని నెత్తురు, మాంసం చూసి, అసహ్యం పుట్టిన శాస్త్రి, ఇంకో ధర్మసూక్ష్మం చెప్పాడు.. అదేమంటే అన్ని ఇంద్రియాలలోకి కళ్ళు ప్రధానం కనుక గాడిద కన్ను పెకిలించి, ఆ కన్నుకి దహన సంస్కారం చేద్దాం అన్నాడు.

ఆ గాడిదకి అప్పటికే ఒక కన్ను లేదు. కనుక ప్రస్తుతం ఉన్న ఒక్క కన్నునే తీసుకొని, గాడిద తలను ప్రక్కనే పారేసి, కన్నుకి శవ సంస్కారం చేద్దామని బయలుదేరారు. అలా ఆ శిష్యులంతా, గోదావరి గట్టుకి చేరారు.

ఇంతలో ఎవరో ఎదురయి, పరమానందయ్య గారి శిష్యుల్ని చూసి... ఏంటి బాబూ, ఇలా వెళ్తున్నారు, మీ చేతిలో ఉంది ఏమిటి అన్నాడు. వెంటనే శిష్యులు పెద్దగా చెప్పారు ఆ వ్యక్తికి, మా దగ్గరున్నది "గాడిదగుడ్డు". మేం ఇప్పుడు ఆ గుడ్డుకి దహన సంస్కారాలు జరిపించబోతున్నాం. వాళ్ళ మాటలు విన్న ఆ వ్యక్తికి బుర్ర తిరిగిపోయింది.

# మంగయ్య మండపేట ప్రయాణం

పరమానందయ్య శిష్యులు చూసి రమ్మంటే, కాల్చివచ్చే రకం. అందుకే పరమానందయ్యగారు, తన శిష్యులకి చాలా జాగ్రత్తగా ఆలోచించి కానీ, ఏ విషయం చెప్పేవారు కాదు. ఒకరోజు రాత్రి పరమానందయ్య గారు, తన భార్యతో ఇలా అన్నారు.

రేపు ఉదయం మన శిష్యుడు మంగయ్యని మండపేట పంపించాలనుకుంటున్నాను. వాడు రేపు ఉదయమే బయలుదేరి సాయంకాలానికి తిరిగి వస్తాడు.

అదే సమయానికి, నిద్రపట్టక ఇంట్లోకి వెళ్ళి కాసిని మంచినీళ్ళు తాగుదామని వచ్చిన మంగయ్య అనే శిష్యుడికి గురువుగారి మాటలు వినపడ్డాయి.

వెంటనే మంగయ్య ఇలా ఆలోచించాడు, నేను గాని ఇప్పటికిప్పుడే బయలుదేరి మండపేట వెళ్ళి, తెల్లారేసరికి తిరిగి వచ్చానంటే గురువుగారు భలే ఆశ్చర్యపడి నా తెలివికి తెగ మెచ్చుకుంటారు. అంతే ఆ ఆలోచన రాగానే ఇంక ఆగలేదు.

భుజాన కండువా వేసుకొని, చేలగట్లకుండా మండపేటకు ప్రయాణం మొదలెట్టాడు. అలా అర్థరాత్రి పూట చేల వెంట వేగంగా వెళ్తున్న మంగయ్యని చూసిన, కొందరు రైతులు దెయ్యం అనుకొని పెద్దగా అరిచి, అవతలికి పారిపోయారు.

కానీ ఇవేమీ పట్టించుకోని, మంగయ్య బాణంలా దూసుకు పోతున్నాడు. అలా వేగంగా చేలగట్ల వెంట వెళ్తున్న మంగయ్యకి, చేలల్లో ఉంచిన ఒక దిష్టిబొమ్మ తగిలింది.

దాంతో మంగయ్య హడలిపోయి ఓర్నాయనో, దయ్యం బాబోయ్, అని అరిచి క్రిందపడ్డాడు. ఆ తర్వాత ఎలాగో లేచి నుంచుని, ఆంజనేయ దండకం చదువుకుంటూ మళ్ళీ నడక ప్రారంభించారు. వేగంగా నడుస్తున్న మంగయ్య, ఒక చోట కాలుజారి, చిన్న నీటిగుంటలో పడ్డాడు.

దాంతో ఒంటిపై ఉన్న బట్టలన్నీ తడిచిపోయి, బురదగా మారాయి. అయినా సరే పట్టు వదలకుండా నడక సాగించి అర్థరాత్రి దాటేసరికి



మండపేట చేరాడు. కాసేపు ఆ వూరి గుడిముందు నుంచుని, ఈ గుడిలో ఉన్న ఓ దేవుడా నేను మండపేట వచ్చాను అనటానికి నీవే సాక్ష్యం అని దండం పెట్టి మళ్ళీ వేగంగా నడుస్తూ, ముక్తేశ్వరం బయలుదేరాడు.



ఇంకా అరగంటలో తెల్లవారుతుందనగా, ఇల్లు చేరాడు మంగయ్య. బురదకొట్టుకుపోయిన బట్టలతో, ఇంటికి ఎదురుగా ఉన్న పెద్ద వేపచెట్టు క్రింద నించున్నాడు. గురువుగారు నిద్రలేచి బయటికి రాగానే తను కనిపించి, మండపేట వెళ్ళి వచ్చానని చెప్పి, గురువు గారిని ఆశ్చర్యపరచాలని మంగయ్య ఉద్దేశ్యం.

దాంతో ఆ వేప చెట్టు క్రింద శిలావిగ్రహంలా కదలకుండా నించున్నాడు. సరిగ్గా అప్పుడే శాస్త్రి అనే శిష్యుడు నిద్రలేచి, లఘుశంక తీర్చుకుందామని (మూత్రం) ఇంకా నిద్రమత్తు వదలకుండానే ఇంటి బయటికి వచ్చి, వేపచెట్టు కేసి చూసాడు, ఆ చెట్టు క్రింద భారీ ఆకారం బురద కొట్టుకొని నిల్చుని కనిపించింది.

అంతే... ఓర్నాయనో, ఇంటి ముందు భూతం నిల్చుంది అని పెద్దగా అరుచుకుంటూ ఇంట్లోకి పరిగెత్తి అందర్నీ నిద్రలేపి, ఇంటి ముందున్న భూతం గూర్చి చెప్పాడు.

వీళ్ళ గందరగోళానికి పరమానందయ్య గారికి నిద్ర వదిలిపోయి, హడావుడిగా, శిష్యుల దగ్గరికి వచ్చి, ఏంట్రా, ఏమయింది, ఎందుకు అరుస్తున్నారు? అన్నారు ఆందోళనగా. మొదట భూతాన్ని చూసిన శాస్త్రి, గురువుగారికి ఇంటి ముందు నిలుచున్న భూతం గురించి చెప్పాడు.

దాంతో పరమానందయ్యగారు శిష్యుల్ని తీసుకొని వాకిట్లోకి వచ్చి చూసారు. అప్పటికే, మంగయ్య చెట్టు క్రింద నుండి ఇవతలికి వచ్చేసాడు. బురదతో నిండిన మంగయ్యను గుర్తించి ఏరా నాయనా? ఏమిటీ అవతారం? ఏం ఘనకార్యం చేసావో చెప్పి తగలడు అన్నారు విసుగ్గా. అప్పుడు మంగయ్య 'రాత్రి మీరు అమ్మగారితో అన్న మాటలు విన్నానండీ' అన్నాడు.

వెంటనే గురువుగారు, ఏం విన్నావురా అన్నారు మంగయ్యతో. అదేనండీ, రేపు ఉదయం మంగయ్యను, మండపేట పంపిస్తా అన్నారుగా అన్నాడు మంగయ్య. అయితే దానికీ, నీ ఒంటిమీద ఈ బురదకీ సంబంధం ఏమిట్రా అన్నారు కొంచెం కోపంగా.

మరేనండీ, మీరు నన్ను ఎలాగూ రేపు ఉదయం మండపేట వెళ్ళమంటారు అని, నిన్న రాత్రే బయలుదేరి మండపేట వెళ్ళి వచ్చానండీ అన్నాడు మంగయ్య. దాంతో ఆశ్చర్యపడ్డ పరమానందయ్యగారు, ఓరి సన్నాసీ! మండపేట వెళ్ళి వచ్చావు సరే... వెళ్ళి అక్కడ ఏం పనిచేసుకొని వచ్చావురా అన్నారు. మంగయ్య వెర్రి చూపులు చూస్తూ ఏం పని చేసుకురావాలో మీరు చెప్పలేదు కదండీ! అన్నాడు.

దాంతో పరమానందయ్యగారు నెత్తి బాదుకుని, ఓరేయ్ నాయనా వెర్రి మంగయ్యా, ఊరు వెళ్ళేముందు, అక్కడికి వెళ్ళి ఏం పని చేసుకురావాలి అన్న ప్రసక్తి లేకుండా, ఇలా తెలివి తక్కువగా ఊరికే వెళ్ళి వస్తే, సమయం, శక్తీ దండగే కదా అన్నారు.

తను చేసిన పొరపాటు ఏమిటో, అప్పటికీ మంగయ్యకి అర్థంకాలేదు. అప్పుడు పరమానందయ్యగారు, మంగయ్యని తీసుకెళ్ళి శుభ్రంగా స్నానం చేయించి, తినటానికి ఏమన్నా పెట్టండి...పిచ్చి సన్నాసి, రాత్రంతా నడిచి వచ్చాడు అన్నారు మిగిలిన శిష్యులతో.

## కార్తీక మాస వనభోజనాలు

కార్తీక మాసం శివుడికి ప్రీతిపాత్రం, ధనుర్మాసం విష్ణువుకి ఇష్టమైన మాసం. ముందుగా వచ్చిన కార్తీక మాసంలో పరమానందయ్యగారి



కుటుంబం ప్రతి సోమవారం ఉపవాసం ఉండి శివపూజలు జరిపేవారు. శిష్యులు మాత్రం తక్కువా.... వాళ్ళు కూడా కార్తీక సోమవారం ఉపవాసాలు చేసేవాళ్ళు. కార్తీకమాసంలో ఉసిరిక చెట్టు ఉన్న తోటలో భోజనాలు చేస్తే, పుణ్యం అని గురువుగారు శిష్యులకి చెప్పారు.

దాంతో ముక్తేశ్వరం గ్రామానికి ఆనుకొని ఉన్న పెద్ద ఉసిరగ తోటలో వనభోజనాలు చేస్తే బాగుంటుంది అని శిష్యులు, గురువుగారికి సలహా



చెప్పారు. గురువుగారు సరేరా మీ ఇష్టం, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చెయ్యండి అన్నారు. ఇక శిష్యులు బండిపై వంటకు కావాల్సిన గిన్నెలు, ఇతర పాత్రలు, బియ్యం తీసుకొని బయలుదేరారు. ఇంకో బండిలో గురువుగారి కుటుంబం బయలుదేరింది. అంతా ఉసిరిగ తోటకి చేరుకున్నారు.

మూడు గోతులు తవ్వి, పెద్ద పొయ్యిలు తయారుచేసారు. వంటకి కావాల్సిన కట్టెలకోసం శాస్త్రి దగ్గరలో ఉన్న షావుకారి అడితీకి వెళ్ళి, షావుకారుకి వనభోజనాలు వండటానికి పుల్లలు కావాలని చెప్పాడు. పరమానందయ్యగారి కోసం అని తెలిసిన ఆ షావుకారు, కావాల్సినన్ని పుల్లల్ని ఉచితంగా ఇచ్చాడు.

శాస్త్రి అవన్నీ కట్టగట్టుకొని ఉసిరిగతోటకి తీసుకొచ్చాడు. ఈలోగా శర్మ గిన్నెలు సిద్ధం చేసాడు. గోదావరిలో స్నానం చేసి, నలుగురు శిష్యులు నాలుగు గంగాళాల నీళ్ళు తెచ్చారు.

శంకరప్ప అనే శిష్యుడు వంటలో దిట్ట. అందువల్ల అతడినే వంట చేయటానికి నియమించాడు. ఈ శంకరప్ప, వంట చేస్తూ, సంగీత సాధన చేసే మేధావి. సరే వంట చెరకు వచ్చింది గదా... పొయ్యి అంటించి అన్నం గంగాళం పొయ్యి మీద పెట్టి పొయ్యికి ఎదురుగా కూర్చుని సంగీత సాధన మొదలు పెట్టాడు. సా - రి - గ - మ - ప - ద - ని - స... అంటూ రాగం మెదలెట్టాడు. ఇంతలో కట్టెల్లో కొంచెం తడి చేరినందువల్ల బాగా పొగ రాసాగింది. ఆ పొగ వంట చేస్తున్న శంకరప్ప కళ్ళల్లోకి,

గొంతులోకి పోయి, పెద్దగా దగ్గు వచ్చింది. దాంతో గొంతు దెబ్బతిని సంగీత సాధన ఆగిపోయింది.

శంకరప్పకి కట్టెలపై మహా కోపం వచ్చింది. అయినా వనభోజనాల పని తనపై ఉంది కనుక అన్నం వండే పనిలో పడ్డాడు. ఇంతలో అన్నం ఉడుకు పట్టింది. 'కుత, కుత' మన్న శబ్దంతో అన్నం ఉడకటం సంగీత పండితుడయిన శంకరప్పకి నచ్చలేదు.

దాంతో అన్నం గిన్నెపై కోపం వచ్చి, ఓసీ అన్నం గిన్నీ! నీకు నేనంటే అంత చులకనా, చూడు నీ భరతం పడతా అంటూ, పొయ్యిలో మండుతున్న కట్టెలపై నీళ్ళు గుమ్మరించాడు. మరి మంట ఆరిపోతే, అన్నం ఉడకదు, 'కుత, కుత' మన్న శబ్దం రాదుగా అదీ శంకరప్ప ఉద్దేశ్యం. దాంతో సగం ఉడికిన అన్నం గంగాళాన్ని అక్కడే వదిలి ఇంకో పని చెయ్యటానికి అక్కడ నుంచి లేచిపోయాడు ఆ తిక్క శంకరప్ప.

ఇక భోజనాలకి కావాల్సిన కూరగాయల కోసం సంతకు వెళ్ళిన శిష్యుడికి ఏ కూరలు కొనాలో అర్థం కాలేదు. ఏం కొనాలి అని ఆలోచించసాగాడు. ఉల్లిపాయ, గోంగూరా నిషిద్ధం. కనుక అవి తినరాదు.



పొట్లకాయ పాములాగా ఉన్నది. పైగా ఈ కార్తీకమాసంలో సర్పాకారంలో ఉన్న పొట్ల కాయ ఎలా కొంటాం..? పోనీ కంద తీసుకుం దామా అంటే కందకూర మహావేడి. గోరు చిక్కుళ్ళు తీసుకుందామంటే అవి మహాపైత్యం కదా... సరే చేమదుంపలు కొందామంటే ఆ చామదుంపలు పిచ్చి వాతం చేస్తాయి. ఏం కొనాలో అర్థం కాక ఆ శిష్యుడు కరివేపాకు, తోటకూరా కొని, ఉసిరిగ తోట వైపు వెళ్ళాడు.

ఆ తర్వాత వంటకి కావాల్సిన నూనె కొందామని బయలుదేరిన ఒక శిష్యుడు, వేరే ఊరుగానుగ దగ్గరికి వెళ్ళాడు. అక్కడ గానుగ ఆడే వ్యక్తిని, ఏ నూనె మంచిది వంటకి అని అడిగాడు. అప్పుడు ఆ గానుగ యజమాని, శనగనూనె తీసుకో స్వామీ, మహా కమ్మగా ఉంటుంది అన్నాడు. వెంటనే ఆ శిష్యుడు నిజమే...... మంచి శనగనూనెతో చింతపండు పులిహోర చేసుకుంటే, మహత్తరంగా ఉంటుంది. పైగా పులిహోర శివుడికి,



వినాయకుడికి, పార్వతీదేవికి కూడా మహాఇష్టం అని అనుకొని, పెద్ద సొరకాయ బుర్ర నిండా శనగనూనె పోయించుకుని, ఉసిరిగ తోటవైపు బయలుదేరాడు.

మధ్య మార్గంలో ఒక పిచ్చి కుక్క ఆ శిష్యుడి వెంటపడింది. దాంతో శిష్యుడు భయంతో, నూనె ఉన్న సొరకాయ బుర్రని కుక్కను బెదిరించటానికి గాలిలో గట్టిగా ఊపాడు. అంతే అసలే బలహీనంగా ఉండే, ఆ సొరకాయ బుర్ర పగిలి, అందులో నూనె శిష్యుడి శరీరం అంతా పడింది.



ఇక వనభోజనం చేసే ముందు, శివుడికి పూజ చేయాలి కదా అందుకే నేరేడు ఆకులు తెద్దామని, ఆ చెట్టు ఎక్కాడు ఒక శిష్యుడు. ఆకులు కోసి క్రిందికి దిగుదామనుకుంటుండగా, చెట్టు క్రింద ఎవరో తుమ్మారు... ఛీ! అపశకునం మళ్ళీ ఎవరైనా తుమ్మే దాకా చెట్టు దిగరాదని, ఆ చెట్టుపైనే సాయంకాలం దాకా కూర్చున్నాడు. ఆ విధంగా శివపూజకు కావాల్సిన ఆకులు తేలేక చెట్టుపై ఉండిపోయాడా శిష్యుడు.

ఇక భోజనానికి కావాల్సిన నెయ్యి, పెరుగు కోసం గ్రామంలో ఒక సంపన్న రైతు ఇంటికి వెళ్ళారు నలుగురు శిష్యులు. ఆ రైతు భార్యకి పరమానందయ్యగారి మీద భక్తి అధికం. అందుకే పెరుగు, నెయ్యి ఉచితంగా ఇస్తానని, పరమానందయ్య గారి శిష్యులకి చెప్పింది. ఈలోగా కాసేపు అలా కూర్చోండి అన్నది. సరే ఊరికే ఏం కూర్చుంటామని ఆ శిష్యులు రైతు ఇంటి పెరటి వైపు వెళ్ళారు.

అక్కడ ఒక డజను బలిసిన గేదెలున్నాయి. అయితే పెరడు నుండి రోడ్డు మీదికి వెళ్ళటానికి సన్నటి ద్వారం మాత్రమే ఉన్నది. దాంతో ఒక

శిష్యుడు ఇతర శిష్యులతో, ఓరేయ్ తమ్ముళ్ళూ.. నాకొక ధర్మ సందేహం వచ్చింది, మీరు దాన్ని తీర్చాలి అన్నాడు. అప్పుడు ఒక శిష్యుడు – ఆ! త్వరగా చెప్పు నీ సందేహం ఏమిటో, క్షణాల్లో తీర్చేస్తా అన్నాడు గొప్పగా. అబ్బే ఏం లేదురా, ఈ రైతు గారి గేదెలకి అంతంత పొడుగున్న కొమ్ములున్నాయి కదా మరి ఆ గేదెలు చచ్చాయనుకో, ఆ గేదెల్ని బయటికి ఎలా తీసుకెళ్తారు అన్నాడు.

అప్పుడు సుబుద్ధి అనే శిష్యుడు, 'వీళ్ళకి నాల్గు జతల ఎడ్లున్నాయి అవి గానీ చచ్చాయనుకోండి, అంత బరువున్న ఎద్దుల్ని బయటికి ఎలా తీసుకెళ్తారో నాకూ అర్థం కావటం లేదు సుమీ' అన్నాడు. వీళ్ళ కోసం పెరుగు, నెయ్యి సిద్ధం చేస్తున్న రైతు భార్యకు వీళ్ళ మాటలు వినబడి భర్తతో చెప్పింది.

దాంతో ఆ రైతు ఓరి మీ దుంపతెగా! పోనీలే పాపం అని పెరుగు, నెయ్యి ఊరికే ఇస్తుంటే మా పాడిపశువులు చస్తే ఏం చెయ్యాలని వాగుతారా. ముందు ఇక్కడి నుండి అవతలికి పొండి అని పరమానందయ్య గారి శిష్యులపై కేకలు వేసాడు. దాంతో శిష్యులకి దడపుట్టి అక్కడి నుండి నిష్క్రమించారు.

ఇక విస్తరాకుల కోసం ఒక శిష్యుడు ఒక అరటితోటలోకి వెళ్ళాడు. అక్కడ అరటి గెలలు వేసిన చెట్లు కనిపించాయి. సరే గెలవేసిన చెట్టు ముత్తయిదువుతో సమానం, అలాంటి చెట్ల ఆకులు ఎలా కోయాలి పాపం కదా అని ఆలోచనలో పడ్డాడు. సరే చిన్న అరటి చెట్టు ఆకులు కోద్దామని, ఆ అరటితోటలో చిన్న చెట్లు ఎక్కడున్నాయో వెదకటానికి, తోట అంతా వెతకసాగాడు.

అరటి తోటల్లో త్రాచుపాములు తిరుగుతుంటాయి. ఆ విషయం తెలియని పరమానందయ్య శిష్యుడు యధేచ్ఛగా తోటలో తిరుగుతూ, పొరపాటున ఒక త్రాచుపాముపై కాలువేసాడు. దాంతో ఆ త్రాచు పడగ ఎత్తి శిష్యుడిని కాటువేయబోయింది.

దాంతో హడలిపోయిన శిష్యుడు, తోటలో అటూ, ఇటూ పరిగెత్తి సగం అరటిచెట్లని విరగ్గొట్టాడు. అరటితోటలో శిష్యుడు చేస్తున్న గందర గోళానికి ఆ అరటితోటకి కాపలాగా ఉన్న వ్యక్తి ఒక కర్ర తీసుకొని పెద్దగా



అరుస్తూ, శిష్యుడు వెంట పడ్డాడు. దాంతో శిష్యుడు పంచెఊడి కాళ్ళకి అడ్డంపడి బురదలో బోర్లాపడ్డాడు.

ఇక ఒక శిష్యుడు భోజనానంతరము సేవించాల్సిన తాంబూలం కోసం తమలపాకుల తోటలోకి వెళ్లి అక్కడున్న రైతుని, ఒక కట్ట తమలపాకులు కావాలని అడిగాడు. పరమానందయ్యగారి శిష్యుడిని గుర్తు పట్టిన, ఆ రైతు ఒక పెద్ద కట్ట తమలపాకులు శిష్యుడికి ఇచ్చాడు.

అవి తీసుకొన్న శిష్యుడు, ఇవతలికి రాకుండా ఆ తమలపాకులన్నీ ఎండిపోతే, ఏం చేస్తారు అని అడిగాడు. దాంతో ఆ రైతుకు చిర్రెత్తుకొచ్చి, ఓరినీ వెధవ సందేహం మాడ, నీకిచ్చిన ఆకులు తీసుకొని తొందరగా అవతలకి చావు అన్నాడు.

సరే శిష్యులు వంటలు చేస్తున్నారు, ఇంక హాయిగా వనభోజనాలు చేయటమే తరువాయి, అని తోటంతా తిరిగి వచ్చిన పరమానందయ్య గారి కుటుంబానికి, పాడైపోయిన వంట, మట్టికొట్టుకుపోయి, వెర్రి ముఖాలతో ఉన్న శిష్యులు కనిపించి "ఛీ! ఇలాంటి పనికిరాని దద్దమ్మలతో కలిస్తే వనభోజనాలు జరగవు; పస్తులే ఉంటాము" అన్నది గురువుగారి ధర్మపత్ని చికాకుగా.

## గురువుగారి అశ్వవాహనం

పరమానందయ్యగారికి కేవలం ఎడ్లబండి మాత్రమే ఉన్నది. ఆయనకి ఎలాగైనా ఒక గుర్రాన్ని ఏర్పాటు చెయ్యాలని, ఆయన శిష్యులు నిర్ణయించు కున్నారు. ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే దానికి తిరుగుండదు – అదీ పరమానందయ్యగారి శిష్యుల తీరు.

అయితే వాళ్ళ దగ్గర గుర్రాన్ని కొనటానికి డబ్బు లేదు. ముందు ఆ డబ్బు సంపాదించి ఆ డబ్బుతో కొందామను కున్నారు. అయితే డబ్బు ఎలా సంపాదించాలి అన్న ప్రశ్న ఏర్పడింది.

వాళ్ళలో అంజి అనే శిష్యుడికి జ్యోతిష్యం బాగా వచ్చు అని, మిగిలిన శిష్యులు నమ్మకం. దాంతో అంజిని జ్యోతిష్యం చెప్పి డబ్బు సంపాదించ మన్నారు. అక్కడికి దగ్గరలో సంత జరగబోతుందని తెలిసి అక్కడ జోస్యం

చెప్పాలని, నిర్ణయించుకొని, అంజి బయలుదేరాడు. అతడికి తోడుగా మిగిలిన పన్నెండు మంది శిష్యులు వెళ్ళారు. గురువుగారికి తాము గుర్రాన్ని కొనబోతున్నాం అని చెప్పలేదు.

అంజి జ్యోతిష్య పండితుడి వేషం వేసుకొని కూర్చున్నాడు. మిగిలిన శిష్యులు సంత అంతా తిరిగి కనపడినవాడికి, చింత చెట్టు క్రింద జ్యోతిష్యం చెప్పే సిద్ధాంతి గారు ఉన్నారు. రండి చెప్పించికోండి మీ భవిష్యత్‌ని అని ప్రచారం చేయసాగారు.

శిష్యుల మాటలు విన్న ఒక స్త్రీ, అంజి దగ్గరికి వెళ్ళి నమస్కారం పెట్టి అతని ముందుకూర్చున్నది. అప్పుడు అంజి, చెప్పమ్మా, నీ సమస్య ఏమిటీ అన్నాడు. అప్పుడా స్త్రీ అంజితో, స్వామీ నా భర్త నన్ను అనుమానించి వదిలేసాడు, అతని మనస్సు మారి మళ్ళీ నన్ను ఏలుకోవాలంటే ఏం చెయ్యాలి అని అడిగింది.

అప్పుడు అంజి, ఆమె అరిచేతిని పరిశీలించి, ఏదో అర్థం అయినట్టుగా తల ఊపి, ఇదిగో అమ్మాయి, నీ భర్త నిన్ను మళ్ళీ ఏలుకోవాలంటే నీవు అతని దగ్గరికి వెళ్ళి, అతని ముందే అగ్ని ప్రవేశం చెయ్యి. నీవు నిజంగా మంచి దానివే అయితే నీకు ఏమీ కాదు.

దాంతో నీ భర్త నిజం తెలుసుకొని, నిన్ను ఆదరిస్తాడు అన్నాడు. అంజి మాటలకి ఆ స్త్రీ, ఓరి నీ ముఖం మండ, మంటల్లో దూకితే చావనట్రా... నీ జ్యోతిష్యం పాడుకాను అని తిట్టి వెళ్ళిపోయింది. పైగా జ్యోతిష్యం చెప్పించుకొని ఒక్క అర్థణా కూడా ఇవ్వలేదు.

ఆ తర్వాత ఒక భర్త, భార్య వచ్చారు. వాళ్ళ చేతులు చూసి భర్తతో ఇలా అన్నాడు. నీకు ఇద్దరు భార్యలుంటారు. దాంతో వచ్చిన వాళ్ళలో భార్య, తన భర్తను తిడుతూ చచ్చినాడా నాకు ముందునుంచి అనుమానం గానే ఉన్నది. నువ్వు వారానికొకసారి పనుంది అని పట్నం వెళ్ళి వస్తున్నావు. ఆ వెళ్ళేది నీ రెండో పెళ్ళాం దగ్గరికేగా అని భర్తను గిచ్చుతూ, పక్కకి లాక్కుపోయింది. ఆ జంట కూడా పైసా అయినా ఇవ్వలేదు.

ఆఖరిగా ఒక పెద్ద భూస్వామి, అంజి దగ్గరికి వచ్చి, సిద్ధాంతి గారూ.. .. మా ఇంట్లో ఒక ఖరీదైన నగ పోయింది అదెక్కడుందో చెపితే, నీకు



గుర్రం కొనుక్కోవటానికి సరిపడ డబ్బులిస్తా అన్నాడు. 'గుర్రం' అనగానే అంజికి, మిగిలిన శిష్యులకి చాలా ఆనందం కల్గింది. అప్పుడు అంజి కళ్ళు మూసుకొని ఆలోచించి ఈ భూస్వామి దగ్గర పోయిన నగ ఎక్కడుం టుందబ్బా అని తెగ ఆలోచించసాగాడు.

ఏమీ తట్టక విసుగు పుట్టి "శ్రీరామా ఎంత పని చేసావయ్యా" అన్నాడు పెద్దగా. ఆ మాట విని భూస్వామి ఇదిగో సిద్ధాంతి ఇక్కడే వుండు, ఒక గంటలో వస్తా అని వేగంగా వెళ్ళిపోయాడు.

ఆ భూస్వామి దగ్గర శ్రీరాముడు అనే గుమస్తా ఉన్నాడు. అతడు చాలా కాలంగా భూస్వామి దగ్గర నమ్మకంగా పని చేస్తున్నాడు. ఒకసారి ఎవరూ ఇంటిలో లేని సమయంలో ఏదో పనిమీద ఆ గుమస్తా భూస్వామి ఇంటికి వచ్చి, మధ్య గదిలో అల్మరాలో ఉన్న నగ తీసుకొని గుట్టు చప్పుడు కాకుండా వెళ్ళిపోయాడు.



అతడిపై ఉన్న నమ్మకం వల్ల ఎవరూ అతడిని అనుమానించలేదు. ఇప్పుడు సిద్ధాంతి 'శ్రీరాముడు' అనటంతో శ్రీరాముడు అనే పేరుగల ఆ గుమస్తా నగ తీసాడని భావించి, నేరుగా ఆ గుమస్తా ఇంటికెళ్ళి, రేయ్ మర్యాదగా నీవు కొట్టేసిన నగ ఇచ్చేయ్ అన్నాడు భూస్వామి.

దాంతో గుమస్తాకి కళ్ళు తిరిగాయి. నేను ఆ నగ తీసానని ఈ భూస్వామికి ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపడ్డాడు. సరే దొంగతనం

బయటపడింది కనుక, ఆ నగను భూస్వామికి తిరిగి ఇచ్చేసి, ఆయన కాళ్ళపై పడ్డాడు. ఈసారి తప్పు క్షమించమని, దాంతో భూస్వామి గుమస్తాని ఏమీ అనకుండా ఆ నగ భార్యకిచ్చి, వెంటనే సంతలో ఉన్న అంజి దగ్గరికి వెళ్ళి దండం పెట్టి –

స్వామి మీరు యోగ దృష్టి గలవారు. అందుకే ఎవరూ కనిపెట్టలేని దొంగను కనిపెట్టి లక్షలు ఖరీదు చేసే మా పూర్వీకుల కాలం నాటి హారాన్ని మాకు మళ్లీ దక్కేలా చేసారు. అని, ఆపై వందరూపాయిలు దక్షిణగా అంజి కిచ్చి, చక్కా పోయాడు ఆ భూస్వామి. ఇంకేం గుఱ్ఱం కొనటానికి సరిపడే డబ్బు వచ్చింది కనుక, జ్యోతిష్యం చెప్పటం ఆపేసి, గుఱ్ఱాన్ని కొనటానికి బయలుదేరారు.

వాళ్ళకి ఒక గుఱ్ఱాలు అమ్మే సాయిబు, ఆ సంతలో కనిపించాడు. దాంతో వాళ్ళు ఆ సాయిబు చేతికి వందరూపాయిలు ఇచ్చి, అయ్యా! మా గురువుగారికి మంచి గుఱ్ఱం కావాలి. పంచకళ్యాణిలా పరుగెత్తాలి మరి అన్నారు.

సాయిబుగారికి అర్థమయింది వీళ్ళు వెర్రి పీనుగులులా ఉన్నారని. దాంతో ఒక కుంటి గుఱ్ఱాన్ని వాళ్ళకిచ్చి, ఇదేరా బాబు పంచకళ్యాణీ అంటే అన్నారు. అప్పుడు ఒక శిష్యుడు, ఆ గుఱ్ఱం కాలు కుంటిగా ఉండేసరికి, ఈ గుఱ్ఱం కుంటిది వద్దు అన్నాడు.

అప్పుడు సాయిబు, అబ్బే అదేం లేదు.. అది నాటకాలు ఆడుతుంది ఒకసారి ఎవరైనా ఎక్కి కొరడాతో ఒక్కటిస్తే, భలే పరిగెడుతుంది అన్నాడు నేర్పుగా.

ఆ గుఱ్ఱానికి మెల్ల కన్ను ఉన్నట్టుంది అన్నాడు ఇంకో శిష్యుడు. అప్పుడు గుఱ్ఱాల సాయబు, అబ్బే అదేం లేదు.. గుఱ్ఱాలలో ఇది ఒక జాతి. మెల్లకళ్ళు ఈ జాతి గుఱ్ఱాలన్నింటికీ ఉంటాయి. పైగా మెల్లకన్ను అదృష్టం అన్నమాట మీరు వినలేదా అన్నాడు.

దాంతో శిష్యులందరూ, నిజమే మమా గురువుగారు కూడా ఒకసారి అన్నారు మెల్లకన్ను ఉన్న వాళ్ళు అదృష్టవంతులు అవుతారని అన్నారు. దాంతో ఇంకేం అనకుండా ఆ కుంటి గుఱ్ఱాన్ని తోలుకొని, గురువుగారి దగ్గరికి బయలుదేరారు. అప్పుడు శాస్త్రి అనే శిష్యుడు ఇలా పాడుతూ గుఱ్ఱం వెంట నడుస్తున్నాడు.

"ఆహా, ఆహా! నేడు కదా సుదినం, గురువు గారి గుఱ్ఱం పంచకళ్యాణి దిగి వచ్చిన సుదినం, ఈ దినం".



## పరమానందయ్య శిష్యుల తర్కశాస్త్ర ప్రతిభ

ఒకసారి పరమానందయ్యగారింటికి ఆయన బావమరిది వచ్చాడు. ఆ వచ్చిన ఆయన గొప్ప తర్కశాస్త్ర పండితుడు. పరమానందయ్యగారు. తన శిష్యుల్ని పిలిచి, బావమరిదికి పరిచయం చేసి, వీళ్ళని మంచి తెలివిగల వాళ్ళుగా చెయ్యాలంటే ఏం చెయ్యాలి బావా అన్నాడు.

అప్పుడా బావమరిది దీనికి పెద్ద కాలం పట్టదు. వీళ్ళని ఒక్కరోజులో తర్కశాస్త్ర ప్రవీణుల్ని చేస్తా. దాంతో మంచి తెలిగల వాళ్ళుగా మారుతారు మీ శిష్యులు అన్నాడు.

బావమరిది మాటలకి సంతోషించిన పరమానందయ్య గారు, తన శిష్యులతో, ఒరేయ్ నాయనలారా! మీరు, ఈ రోజు నా బావమరిది దగ్గర



తర్క శాస్త్ర పాఠాలు నేర్చుకోండి, అది మీకు చాలా ఉపయోగిస్తుంది అన్నాడు. దాంతో శిష్యులు అలాగే నండీ గురువుగారు అన్నారు.

మర్నాడు అందరూ భోజనాలు చేస్తుండగా, తర్క శాస్త్ర పండితుడు, పరమానందయ్య శిష్యుడు కామేశాన్ని, తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. ఇంతలో గురువుగారి భార్య గుత్తి వంకాయ కూర వడ్డిస్తూ వచ్చింది. తర్క

పండితుడికి ఒక కాయ వేసింది. అతని ప్రక్కనే కూర్చున్న కామేశానికి వంకాయ వడ్డించకుండానే వెళ్ళిపోయింది.

అప్పుడు తర్క పండితుడు, తన ప్రక్కనే ఉన్న కామేశంతో ఇలా అన్నాడు. ఏమోయ్! ఇలా చూడు.. నా ఆకులో ఒక్క వంకాయ ఉన్నది. నేను నా తర్క పాండిత్యంతో నా ఆకులో ఉన్నవి రెండు వంకాయలు అని వాదిస్తాను అన్నాడు.

తన ఆకులో వంకాయ వడ్డించలేదని బాధపడుతున్న కామేశం తర్కశాస్త్ర పండితుడి వైపు చూస్తూ, అయతే ఇప్పుడు మీ విస్తరిలో రెండు వంకాయలు ఉన్నాయని మీరు వాదిస్తున్నారా అన్నాడు గంభీరంగా.

దానికి తర్కపండితుడు, అందులో సందేహం ఏముంది అన్నాడు. అప్పుడు కామేశం, తర్కపండితుడి ఆకులో వడ్డించిన వంకాయను తన ఆకులో వేసుకుని మీ తర్క పాండత్యం ప్రకారం మీ ఆకులో ఉన్న రెండు వంకాయలలో ఒకటి నేను తింటాను. రెండోది మీరు తినండి అన్నాడు.

దాంతో తర్క పండితుడి బుర్ర తిరిగి, ఇక మాట్లాడకుండా భోజనం మొదలు పెట్టాడు. ఇదంతా చూస్తున్న పరమానందయ్యగారు శిష్యుడి చమత్కారానికి చిన్నగా నవ్వుకున్నారు.

ఆ రోజు సాయంకాలం బావమరిది కోసం కజ్జికాయలు వండించారు పరమానందయ్య గారు. వాకిట్లో మంచం వేసుకుని ఏదో ఆలోచిస్తూ పడుకున్న తర్కశాస్త్ర పండితుడికి ఒక కజ్జికాయను పళ్ళెంలో పెట్టి తెచ్చాడు కామేశం.

కామేశాన్ని చూడగానే ఉదయం భోజనాల సమయంలో తన ఆకులోంచి మాయం అయిన వంకాయ గుర్తుకి వచ్చి గతుక్కుమన్నాడు.

అయినా సరే తొణక్కుండా కామేశంతో, ఏమోయ్ కామేశం ఏమిటిది ఒక్క కజ్జికాయే తెచ్చావేం అన్నాడు. అప్పుడు కామేశం, అయ్యా! అమ్మగారు రెండు కజ్జికాయలు పంపారండీ అన్నాడు వినయంగా. అప్పుడు తర్కశాస్త్ర పండితులు ఇలా అన్నాడు.

ఒరేయ్ కామేశం! మీ అమ్మగారు రెండు కజ్జికాయలు పంపారు. కానీ ఈ పెళ్ళెంలో ఒకటే ఉన్నది, మరి రెండో కజ్జికాయ ఏది? అన్నాడు.



అప్పుడు కామాశం, ఆ రెండో కజ్జికాయ ఇదే అన్నాడు. తర్క పండితుడికి అర్థమయింది, పరమానందయ్య గారి శిష్యుల తెలివి తర్కానికి అందనిది అని.

## సున్నిత సంభాషణం

ఒకసారి పరమానందయ్యగారు, తన శిష్యులకి ఎలా మాట్లాడాలో ఎలా మాట్లాడితే సమాజంలో గౌరవం లభిస్తుందో వివరిస్తున్నారు. ఓరే శాస్త్రీ! నేను చెప్పేది వింటున్నావా అన్నారు గురువుగారు శిష్యుడు శాస్త్రి కునికిపాట్లు పడుతూ కూర్చుంటే. దాంతో ఉలిక్కిపడ్డ శాస్త్రి అబ్బే నేను నిద్రపోవటం లేదు గురువుగారండీ, మీరు చెపుతున్నది జాగ్రత్తగా కళ్ళు మూసుకుని వింటున్నాను అన్నాడు.

పరమానందయ్య గారు నవ్వి, ఆపై ఇలా చెప్పసాగారు. "మనం ఏం చెప్పాలన్నా అలా సుతారంగా, రాగయుక్తంగా, అవతలి వాళ్ళకి వినటానికి హాయిగా ఉండేలా, మెల్లిగా చెప్పాలి. ఇంకా తక్కువగా, నిదానంగా మాట్లాడాలి.



అప్పుడే మన మీద ఎదుటి వారికి మంచి గౌరవం ఏర్పడుతుంది. గురువుగారి మాటలను శ్రద్ధగా విన్న శిష్యులు, ఇకపై అలాగే మాట్లాడుతామని గురువుగారికి హామీ ఇచ్చారు.

ఒక రోజున పరమానందయ్య గారు, ఆయన భార్య, కూతురు పనిమీద ప్రక్క గ్రామం వెళుతూ, ఇల్లు శిష్యులకి అప్పగించి వెళ్ళారు. సరే అందరూ నిద్రలో ఉండగా దొంగలు పడి ఇంట్లో సామానంతా మూటలు కట్టవెళ్ళిపోవటానికి సిద్ధంగా ఉన్నారు. సరిగ్గా ఆ సమయంలో శాస్త్రి అనే శిష్యుడికి మెలుకువ వచ్చి, ఇంట్లో ఏదో శబ్దం అవుతుంది ఏమిటా అని చూసాడు.

ఇంటి మధ్యలో బంగారం, బట్టలు మూటలు కడుతున్న దొంగలు కన్పించారు. వాళ్ళని చూడగానే కంగారు పుట్టి హడావుడిగా మిగిలిన శిష్యుల్ని లేపుదామనుకున్నవాడు, గురువుగారు చెప్పిన మాట 'ఏ విషయం అయినా నిదానంగా చెప్పాలి...' అన్నది గుర్తుకి వచ్చి ఒక శిష్యుడిని తట్టి లేపాడు. ఆ శిష్యుడు లేచి కూర్చుని, బద్ధకంగా ఆవులిస్తూ, ఏంటిరా, ఇలా అర్ధరాత్రి పూట లేపి ఛస్తావు, ఏంటి సంగతి అన్నాడు.

అప్పుడు శాస్త్రి దొంగలు పడ్డ విషయం ఇలా చెప్పసాగాడు. ఒ – రే – య్ – కా – మే – శం – మ – న – ఇం – ట్లో – దొం – గ – లు – ప –డ్డా – రు – అం – ద – ర్నీ – లే – పు..... శాస్త్రి ఇలా ఒక్కో పదాన్ని విరామాలతో పూర్తి చేసేసరికి దొంగలు, దొంగిలించిన సొమ్ముతో ఇల్లు దాటిపోయారు.



విషయం అర్థమైన కామేశం పెద్దగా అరిచాడు. ఓర్నాయనో మన ఇంట్లో దొంగలు పడ్డారురోయ్ అని. కామేశం అరుపులు విని, మిగిలిన శిష్యులంతా నిద్రలేచి మూల ఉన్న దుడ్డు కర్రలు తీసుకొని, దొంగలు వెళ్ళిన వైపు పరిగెత్తారు. కానీ అప్పటికే, ఊళ్ళో కాపలాగా తిరుగుతున్న ఇద్దరు బలమైన వ్యక్తులు దొంగల్ని పట్టుకుని చావబాదుతున్నారు.

శిష్యుల్ని చూసి గుర్తు పట్టిన ఆ గ్రామకాపలా వాళ్ళు, వాళ్ళ సొమ్ము వాళ్ళకి అందించారు. దాంతో బ్రతుకుజీవుడా అనుకుని, ఆ నగల, బట్టల మూటలు తీసుకెళ్ళి ఇంట్లో పెట్టి తాళం వేసి, కాపలాగా నిద్రమానేసి కూర్చున్నారు.



మర్నాడు ఊరి నుండి తిరిగి వచ్చిన గురువుగారికి విషయం తెలిసి, నిదానంగా మాట్లాడమంటే, అలా ఒక్కో అక్షరం పల్కటం కాదని, శిష్యులకి వివరించాడు. గురువుగారి మాటల్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలీక శిష్యులు ఆలోచనలో పడ్డారు.

## తప్పిపోయిన పెళ్ళి

పరమానందయ్య గారి అమ్మాయికి, సింహాచల ప్రాంతానికి చెందిన పేరయ్యగారి అబ్బాయితో సంబంధం కుదిరింది. పరమానందయ్య గారు పెద్ద సంపన్నులు కాకున్నా, ఆయన కుమార్తె బుద్ధిమంతురాలు కావటం వల్ల మగపెళ్ళివారు, పెద్దగా కట్నాలు, లాంఛనాలు ఆశించకుండా పరమానందయ్యగారి అమ్మాయిని చేసుకోవటానికి ఇష్టపడ్డారు.

గురువుగారి ఇంట్లో పెళ్ళి అనగానే, ఆయన శిష్యుల ఆనందానికి పట్ట పగ్గాలు లేకుండా పోయాయి. వంతులు వేసుకొని పెళ్ళి పనులు చేయసాగారు.

పెళ్ళికొడుక్కి క్షయ రోగం ఉన్నది. ఆ విషయం దాచిపెట్టి పెళ్ళిళ్ళ పేరయ్య ఈ సంబంధం కుదిర్చాడు. దాంతో అసలు తమ బిడ్డకి పెళ్ళేకాదని బాధపడుతున్న మగపెళ్ళివారు.

పరమానందయ్య గారు అమ్మాయిని ఇస్తాం అనగానే చాలా సంతోషించి కట్న, లాంఛనాల కోసం పెద్దగా పట్టు బట్టకుండా పెళ్ళి కానిచ్చేద్దామని భావించారు.

పెళ్ళి రెండురోజులు ఉన్నదనంగా మగపెళ్ళి వారు పరమానందయ్య గారింటికి వచ్చేసారు. ముక్తేశ్వరం గ్రామస్థులంతా, పరమానందయ్య గారి కుమార్తె వివాహానికి చాతనయినంత సహకారం అందించారు. పరమానందయ్య గారి ఇంటి ముందున్న మామిడి తోటలో ఉన్న చిన్న పెంకుటిల్లు పెళ్ళి వారికి విడిదిగా ఇచ్చారు.

ఇక పెళ్ళి వారికి కావాల్సిన ఆహారం, మంచాలు, బల్లలులాంటి వన్నీ పెద్దమొత్తంలో సిద్ధం చేసి ఉంచారు శిష్యులు. గురువుగారు తన ఇంటికి సున్నం కొట్టించారు. పెళ్ళి వారి విడిదికి కూడా సున్నం కొట్టమని

శిష్యులకి చెప్పారు. అయితే గురువుగారు ఒక్క తప్పుమాట అన్నారు. అదేమంటే పెళ్ళి వారి విడిదికి ఒక్క అంగుళం కూడా ఖాళీ లేకుండా వదలకుండా సున్నం కొట్టమన్నారు.

అంతే పరమానందయ్య గారి శిష్యులు గోడలకి సున్నం కొట్టి, ఆ హడావుడిలో వాకిట్లో అరుగు మీద కూర్చున్న, పెళ్ళి కొడుకు తల్లికి, తండ్రికి కూడా సున్నం కొట్టారు. అది చూసిన ఎవరో పరమానందయ్య గారికి చెప్పారు.

దాంతో ఆయన పెళ్ళికొడుకు తల్లిదండ్రులకి క్షమాపణ చెప్పి శిష్యుల్ని చివాట్లు పెట్టాడు. ఏమిరా నాయనలారా! ఈ పెళ్ళి అయ్యేదాకా మీరు కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనులు చేయండి అన్నాడు. ఆ తర్వాత, శిష్యులు పెళ్ళి వారికి హాయిగా ఉండాలని గంధం ఇచ్చి వంటికి రాసుకోమన్నారు. పెళ్ళివాళ్ళు అనుమానంగానే ఆ గంధం తీసుకున్నారు.

వంట బ్రాహ్మణులు దగ్గరికి వెళ్ళి, ఏమయ్యా! పెళ్ళి వారికి ఫలహారాలు ఏం చేస్తున్నారు అని అడిగాడు శర్మ అనే శిష్యుడు. వాళ్ళు ఉప్మా చేస్తాం అన్నారు. సరే అలాగే చెయ్యండి అందులో నంజుకోటానికి పచ్చళ్ళు ఏం చేస్తారు అని రెట్టించాడు, అల్లపు పచ్చడి చేస్తున్నాం అన్నాడు వంటాయన.

అది సరే వంటకి నెయ్యివాడుతున్నారా లేదా అని ఆరా తీసాడు, శర్మ వెనకాలే నించున్న శాస్త్రి. దాంతో ఆ వంటాయనకి తిక్కరేగి నెయ్యి కాదు ఆముదం వాడుతాం అన్నాడు. ఓహో భలే, వంటావదం అంటే అదే నన్న మాట అన్నాడు శాస్త్రి.

ఇంతలో గురువుగారు, శిష్యుల్ని పిలిచి పెళ్ళి వారు పూజలు చేసుకోవటానికి ఏమైనా పూలు తీసుకెళ్ళి ఇవ్వండి అన్నారు. దాంతో శిష్యులు బోల్డన్ని జిల్లేడు పూలు కోసి బుట్టలో పెట్టుకొని పెళ్ళి వారి విడిదికి తీసుకెళ్ళి ఇచ్చారు.

పరమానందయ్య శిష్యులు చేస్తున్న ఈ విచిత్రమైన పనులు చూసి, తమ అబ్బాయికి క్షయ వ్యాధి ఉన్నదని తెలిసి ఇలా ఏడిపిస్తూ ఉన్నారేమో అని వాళ్ళకి అనుమానం వచ్చింది. ఐనా పెళ్ళి అయ్యేదాకా మౌనంగా ఉండాలని నిర్ణయించుకొన్నారు.



ఇక భోజనాల వద్దన... శిష్యులు హడావుడిగా ఒకరు అడిగిన వాళ్ళకి మరొకటి వడ్డిస్తున్నారు. దాంతో వళ్ళు మండిన ముసలాయన, ఓరే వెధవల్లారా! మా అందరి ముఖాల్నా వేడిచారు పోసి చావండిరా, మా భోజనాలు పూర్తి అవుతాయి అని అరిచాడు. అంతే పదమూడు మంది శిష్యులు పెద్ద గంగాళం నిండా మరిగే చారు తీసుకువచ్చి, గరిటలతో అందరి ముఖాలపై చారును పోసారు.

దాంతో వేడిచారు ముఖాన పడ్డవాళ్ళు, గంగవెర్రులెత్తి భోజనాలు చేసే ప్రాంతం నుండి పరిగెత్తసాగారు. ఇదంతా గమనించిన పెళ్లివారు హడలిపోయి, తమ కొడుకు వ్యాధి సంగతి బయటపడిందని అనుమానించి, అప్పటికి నిశ్శబ్దంగా ఊరుకుని, విడిదింటికి వెళ్ళి, ఆ రోజు అర్ధరాత్రి దాటాక చల్లగా ఊరు వదిలి పారిపోయారు.



తెల్లారితే పెళ్ళి అనగా ఇలా మగపెళ్ళివారు వెళ్ళిపోవటం వల్ల గురువుగారి కూతురు పెళ్ళి ఆగిపోయింది. దాంతో గురువుగారి భార్య శిష్యుల్ని నానా తిట్లు తిట్టిపారేసింది. అప్పుడు ఆ వూరి గ్రామపెద్ద భార్య వచ్చి, గురువుగారి భార్యతో, ఊరుకోమ్మా... నీ కూతురి పెళ్ళి ఆగిపోయిందని వాళ్ళని తిట్టి పోస్తున్నావు. అది మీ మంచికే జరిగింది. పెళ్ళికొడుక్కి క్షయ వ్యాధి ఉంది మీకు తెలుసా అంది. అది విన్న పరమానందయ్యగారు, ఆయన భార్య ఒక్కసారి బిత్తరపోయారు. జరిగిందంతా తమ మంచికే అని గ్రహించి వారిరువురూ శిష్యుల్ని ఆశీర్వదించారు.

# ఏరుతో వివాదం

పరమానందయ్యగారి శిష్యులు ఒకసారి కరప గ్రామానికి వెళ్ళవలసి వచ్చింది. ఆ వూరు చేరాలంటే మధ్యలో ఒక వాగును దాటాల్సి వుంటుంది. దాంతో వాళ్ళు కొంత జంకినా, గురువుగారి పని కదా అన్న భక్తి భావంతో ధైర్యంగా 'కరప'కు ప్రయాణం ప్రారంభించారు.

సరిగ్గా మిట్ట మధ్యాహ్నానికి వాళ్ళు వాగుఒడ్డుకి చేరుకున్నారు. ఆ వాగు నీరు నడుమ లోతు మాత్రమే ఉన్నది. అయినా వాగులో దిగటానికి వాళ్ళకి ధైర్యం చాలక ఒడ్డునే కూర్చుండిపోయారు. వాళ్ళల్లో ఒకడైన శంకరయ్య ఇలా అన్నాడు.....

ఒరేయ్ తమ్ముళ్ళు. మనం నిద్రపోయినట్టుగానే, ఈ ఏరు కూడా నిద్రపోతుంది. అది నిద్రపోయిన సమయంలో మనం ఏరు దాటుదాం. శంకరయ్య మాటలు విన్న మిగిలిన శిష్యులు అలాగే, అలాగే అన్నారు. అయితే వాగు నిద్రపోయింది అన్న విషయం మనకి ఎలా తెలుస్తుంది అని అన్నాడు శాస్త్రి ఆందోళనగా.

అప్పుడు శర్మ ఇలా అన్నాడు – ఉండండిరా దద్దమ్మల్లారా! నేను ఇప్పుడే తేల్చేస్తాను.

ఈ వాగు నిద్రపోయిందా లేదా అని. సరే శర్మ ఏం చేస్తాడా అని మిగిలిన శిష్యులు ఆసక్తిగా చూస్తున్నారు. అప్పుడు శర్మ తమ దగ్గరున్న పెద్ద ఇత్తడి చెంబుని, వాగులోకి దిగి, నీళ్ళలో ముంచాడు.

దాంతో వాగు నీళ్ళు చెంబులోకి పోయి, బుడ, బుడ, మని శబ్దం వచ్చింది. దాంతో శర్మ ఆ చెంబు నీళ్ళలోనే వదిలేసి కంగారుగా ఒడ్డుకి వచ్చి, ఒరేయ్! ఈ వాగు ముండ ఇంకా నిద్రపోలేదురా అన్నాడు. అందరూ ఆలోచించసాగారు ఈ వాగు ఎప్పుడు నిద్రపోతుందా? ఎప్పుడు వాగు దాటి 'కరప' వెళ్ళాలా అని.

సరే వాళ్ళు ఇలా ఎవరి ఆలోచనలో వాళ్ళుండగా, ఒక సాయిబుగారు వాగు దాటటానికి వచ్చి, ఒడ్డున మౌనంగా కూర్చున్న పరమానందయ్య గారి శిష్యుల్ని చూసి, అరే! ఏంటీ బ్రాహ్మలూ ఒడ్డున కూర్చుని ఉన్నారే. వాగు దాటటానికి ముహూర్తం ఏమైనా పెట్టారా ఏమిటి? అన్నాడు హేళనగా.



సాయిబుగారి మాటలు విన్న శాస్త్రి, ఏమండీ సాయిబుగారు, ఏరు ఎప్పుడు నిద్రపోతుందో మీకేమన్నా తెలుసా అన్నాడు. శాస్త్రి మాటలు విన్న సాయిబుగారు, హరే, ఏంటి, నీకేమైన పొగరెక్కిందా. హేరు ఎక్కడన్నా నిద్రపోతుందా అన్నాడు ఆశ్చర్యంగా.

అప్పుడు శర్మ అనే శిష్యుడు, సాయిబుగారితో ఇలా అన్నాడు. మీకు తెలీదు సాయిబుగారు. ఈ ఏరు మా ఊరి షావుకారుని మోసం చేసి, ఆయన ఉప్పు బస్తాలు మెక్కేసింది.

సాయిబుగారికి వినోదంగా అనిపించాయి, పరమానందయ్యగారి శిష్యుల మాటలు. దాంతో శాస్త్రిని అడిగాడు, హరే హేస్టీ మీరు చెప్పేది. ఈ వాగు హుప్పు బస్తాని మెక్కిందా చాలా ఆశ్చర్యంగా ఉన్నదే, అది ఎలా జరిగింది.

అప్పుడు శాస్త్రి, మా ఊరి షావుకారు రాజమహేంద్రవరంలో సరుకులు తెచ్చి, మా వూళ్ళో అమ్ముతాడు. ఒకసారి రెండు ఉప్పు బస్తాలు తెస్తుండగా, పొరపాటున ఈ వాగులో పడ్డాయి.



వెంటనే ఆ బస్తాలు తీసే శక్తి లేక షావుకారుగారు నలుగురిని పిలిచి వాళ్ళ సాయంతో ఆ ఉప్పు బస్తాను బయటికి తీద్దాం అని చూసేసరికి, ఆ బస్తాలలోని ఉప్పుని ఈ వాగు తినేసి, ఖాళీగోతాలు వదిలింది అని మా షావుకారికి తెలిసింది అన్నాడు.

పరమానందయ్య గారి శిష్యుల మాటలు విన్న సాయిబు గారికి, వాళ్ళ అజ్ఞానం సంగతి అర్థమయి వాళ్ళని ఇంకా ఏడిపించాలనిపించింది. దాంతో సాయిబుగారు ఇలా అన్నాడు.

అరే! బాబులూ... మాకి కూడా ఇలాంటి అనుభవమే ఒకసారి జరిగింది, అది మీకి సెప్తాన్ వింటారా. సాయిబుగారి మాటలు ఆసక్తికరంగా అనిపించి, చెప్పండి సాయిబుగారూ... అన్నారు పరమానందయ్యగారి శిష్యులు.

ఒకసారి నేను హైదరాబాద్ నుంచి ఒక బస్తాడు పత్తి తీస్కుని వస్తున్నాను, హప్పుడు అర్థరాత్రి అయింది. ఈ వాగు దగ్గరికి వచ్చి, నీళ్ళలో దిగాను, నెత్తిమీద పత్తి బస్తా ఉంచుకుని వాగు దాటుతుండగా, కాలుజారి బోర్లాపడ్డాను, నా నెత్తి మీద పత్తి బస్తా కాస్తా ఈ వాగులో పడింది.

నేను ఎలాగో లేచి నుంచుని, నీళ్ళ అడుక్కి చేరిన పత్తిబస్తాను ఎత్తాలని చూస్తే, అది చాలా బరువెక్కింది. ఈ వాగు నా పత్తిని ఆవహించింది. దాంతో పత్తిబస్తా మోయలేనంత బరువెక్కింది. ఏం చెయ్యాలో అర్థంకాక, ఆ బస్తాని అక్కడే వదిలేసి, వాగు దాటి మా వూరు వెళ్ళిపోయాను అన్నాడు సాయిబుగారు.

ప్రత్తి నీళ్ళలో నానితే నీళ్ళు పీల్చుకుని, బరువు ఎక్కటం సహజమే. ఆ విషయం తెలీని పరమానందయ్యగారి శిష్యులు, ఈ వాగు నిజంగా దయ్యంలాగా మనుషుల్ని పీడిస్తుంది అని నిర్ణయానికి వచ్చారు. దాంతో ఆ వాగు ఎలా దాటాలి అన్న ప్రశ్న వాళ్ళని వేధించసాగింది.

వాళ్ళ ముఖాల్ని చూసిన సాయిబు గారికి, వాళ్ళు ఏం ఆలోచిస్తున్నారో అర్థమయి, ఇలా అన్నాడు, హరే, మీరు ఏమీ బాధపడకండి. మిమ్మల్ని జాగ్రత్తగా ఈ వాగుదాటించే పూచీనాది. సాయిబుగారి మాటలు విన్న పరమానందయ్యగారి శిష్యులు ధైర్యం తెచ్చుకుని సాయిబుగారే అంతా చూసుకుంటారని ధైర్యంగా ఉన్నారు.

కాసేపు గడిచిన తర్వాత, సాయిబుగారు, పరమానందయ్యగారి శిష్యులతో, అందరూ ఒకేసారి ఈ వాగుని దాటాలి, మీరు ఒకరి చేయి ఒకరు పట్టుకోండి. అందులో ఒకరు, నా చేయి పట్టుకోండి, అప్పుడు అందరం వరుసగా, ఒకరి చేయి, ఒకరు పట్టుకొని దాటినట్టు అవుతుంది. అలా దాటితేనే, ఈ వాగు నిశ్శబ్దంగా ఉంటుంది అన్నాడు.



సరే అని, సాయిబుగారు చెప్పినట్టే ఒకరి చేయి ఒకరు పట్టుకొని, సాయిబుగారి ద్వారా ఆ వాగుని దాటి 'హమ్మయ్య' అనుకున్నారు. ఆ సాయిబుగారు వీళ్ళ అమాయకత్వానికి నవ్వుకొని తన దారిన, తాను వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత పరమానందయ్యగారి శిష్యులు 'కరప' గ్రామం వెళ్ళి గురువుగారి పని పూర్తి చేసుకొని, మరలా ఆ వాగు దగ్గరికి వచ్చి, ఉదయం ఎలా వాగుని దాటారో, అలాగే వచ్చేటప్పుడు కూడా, ఒకరి చేయి ఒకరు పట్టుకొని వాగు దాటారు.

ఆ తర్వాత వాళ్ళు ఎన్నడూ ఆ వాగు వైపుగా రాలేదు. ఆ వాగు మహా మోసపు ముండ... అది ఒంటరిగా ఎవరైనా వెళితే చంపుతుంది అని అందరికీ చెప్పసాగారు.

## పరమానందయ్య శిష్యుల గణిత పాండిత్యం

ఒకసారి పరమానందయ్య శిష్యులు ఏదో పనిమీద ఇంకో ఊరు వెళ్ళాల్సి వచ్చింది. మధ్య దారిలో ఒక చిన్నవాగు ఉన్నది. ఆ వాగు కేవలం వర్షం పడినప్పుడే మెడ లోతుగా ప్రవహిస్తుంది. మామూలు సమయాలలో మోకాలి లోతు నీరు కూడా ఉండవు.

సరే పరమానందయ్య శిష్యులు బయలుదేరి ఆ వాగుదాకా వచ్చారు. అప్పుడు వర్షం లేదు కనుక వాగు నీరు పాదాల దాకానే ఉన్నది. దాంతో వాళ్ళు హాయిగా వాగును దాటేసి అవతలి ఒడ్డుకి చేరారు. ఆ తర్వాత నడుచుకుంటూ వెళ్ళవల్సిన గ్రామానికి వెళ్ళారు. అక్కడ ఒక శాస్త్రి గారి ఇంట్లో బ్రాహ్మణార్థం చేయటానికి వెళ్ళారు ఈ శిష్యబృందం.

పరమానందయ్యగారి శిష్యుల తెలివి తక్కువతనం గురించి అప్పటికే తెలుసుకుని ఉన్న ఆ శాస్త్రిగారు, వీళ్ళతో చాలా జాగ్రత్తగా వ్యవహరించి, తన పనిగడుపుకుని, వాళ్ళని సాగనంపాలి అని నిర్ణయించుకున్నాడు. చనిపోయిన వాళ్ళకి తర్పణాలు వదిలినాక, పరమానందయ్య గారి శిష్యుల

కాళ్ళు కడిగి భోజనాలు పెట్టారు. సరే ముందు పప్పు వడ్డించారు. దాంట్లోకి కాచిన నెయ్యి వడ్డించారు.

పరమానందయ్యగారి శిష్యులు ఆనందంగా భోజనాలు కానిస్తున్నారు. ఒక అరగంటలో వండిన వన్నీ సంపూర్తిగా తిని, శాస్త్రిగారిని ఆశీర్వదించి, మళ్ళీ తమ గ్రామానికి బయలుదేరారు.

వాళ్ళు అలా నడుస్తూ, అలసట తెలియకుండా ఉండటం కోసం, గణిత శాస్త్ర సంబంధ ప్రశ్నలు అడగటం, వాటికి జవాబులు చెప్పటం లాంటి సంభాషణలు జరపాలని నిర్ణయించుకొని, ఆ ప్రకారంగా ఒకడు ప్రశ్న అడగటం, మిగిలిన వాళ్ళు జవాబులు చెప్పటం మెదలయింది.

ముందుగా శాస్త్రి ప్రశ్న వేశాడు. అరేయ్ వేదాలు ఎన్నిరా?

వెంటనే సుబుద్ధి అన్న శిష్యుడు, ఛీ! ఇది కూడా ప్రశ్నేనా... వేదాలు నాలుగు అన్నాడు. అదిగో! పప్పులో కాలేశావు.

నా ఉద్దేశ్యం వే – దా – లు అన్న అక్షరాల సంఖ్య అని, అప్పుడు సమాధానం మూడే కదా అన్నాడు శాస్త్రి గర్వంగా. దాంతో మిగిలిన శిష్యులు శాస్త్రిని అభినందించారు.

ఆ తర్వాత శర్మ గణిత ప్రశ్నని అడిగాడు. భార్యా భర్తలు ఎందరు? అప్పుడు ఒక శిష్యుడు భార్య, భర్త అంటే ఇద్దరు అన్నాడు. వెంటనే శాస్త్రి, చవటా ద్రౌపది భార్యా, పాండవులు భర్తలు.

అందరూ కలిపి ఆర్గురు అన్నాడు. అందరూ ఆనందంగా కేకలు వేసారు. వాళ్ళు నడుస్తూనే మాటలు సాగిస్తున్నారు. సుబుద్ధి అనే శిష్యుడు ఇలా ప్రశ్నించాడు.

ఓరేయ్, పది మధ్యలో సున్నా పెడితే ఏమవుతుంది? వెంటనే శాస్త్రి పది మధ్యలో సున్నా పెడితే వంద అవుతుంది అన్నాడు. సుబుద్ధి పక, పకా నవ్వి, ఓరి మొద్దు ముఖమా! 'పది' అన్న సంఖ్యను అక్షరాలుగా రాసి మధ్యలో సున్నా పెడితే 'ప – ం – ది' అవుతుంది.... అంటే పంది అవుతుంది అన్నాడు.

ఇలా మాట్లాడుకుంటూ నడుస్తూ ఉండగా హఠాత్తుగా మబ్బులు పట్టి కుంభవృష్టి మొదలయింది. దాంతో పరమానందయ్య శిష్యులు గబ,గబా



నడిచి, ఒక మర్రిచెట్టు కొమ్మల క్రిందకు వెళ్ళి తడవకుండా నించున్నారు. ఒక గంట కురిసి, వర్షం ఆగిపోయింది.

వాళ్ళు మళ్ళీ నడక ప్రారంభించారు. అలా నడిచి, నడిచి చివరికి వాగుదాకా వచ్చారు. ప్రొద్దున వాళ్ళు వాగు దాటినప్పుడు కేవలం పాదాల దాకా వచ్చిన నది నీరు, ఇప్పుడు మెడలోతుగా ప్రవహిస్తున్నది. దాంతో వాళ్ళు ఆ నదిని ఎలా దాటాలా అని ఆలోచించసాగారు. అప్పుడు ఒక పడవవాడు వాగులో వస్తూ కన్పించాడు.



వాగునిండుగా ప్రవహిస్తున్నప్పుడే చేపలు పట్టటానికి చిన్న పడవని వాడుతూ ఉంటాడా పడవవాడు. పరమానందయ్య శిష్యుల్ని చూసి, ఏంటి అయ్యలూ! ఒడ్డున నిలుచున్నారు.

నీళ్ళలోకి దిగండి అన్నాడు. దాంతో పరమానందయ్య గారి శిష్యులు పడవ వాడితో ఇలా అన్నారు. ఇదిగో పడవబ్బాయి! దయచేసి మమ్మల్ని నీ పడవలో అవతలి ఒడ్డు చేర్చవా?.

వాడు సరే అని పరమానందయ్యగారి శిష్యుల్ని అవతలి వైపుకు చేర్చుదామని, పడవ ఎక్కించాడు. కానీ శిష్యుల బరువుకి, ఆ చిన్న పడవ బోర్లాపడి, పడవలోని శిష్యులు వాగులో పడ్డారు.

కానీ అప్పటికే ఏరు వేగం తగ్గిపోయి, నీటిలోతు మోకాళ్ళ దాకా వచ్చేసింది. దాంతో ఎవరికీ ఏ ప్రమాదం లేకుండా అందరూ ఒడ్డుకి చేరారు.

అప్పుడు శిష్యులలో మహామేధావి అని పేరు పొందిన సుబుద్ధి, ఇలా అన్నాడు. ఒరేయ్ తమ్ముళ్ళూ! మనం అందరం ఒడ్డుకి చేరామో లేదో

ఒకసారి లెక్కవేస్తే మంచిది. సుబుద్ధి మాట అందరికీ నచ్చింది. వెంటనే శాస్త్రి శిష్యుల్ని వరుసగా నుంచోపెట్టి లెక్కించాడు.

ఒకటి – రెండు – మూడు – నాలుగు..... అబ్బా పన్నెండు మందే ఉన్నారు. మనం మొత్తం పదమూడు మందిమి కదా. ఇప్పుడు 12 మందే ఉన్నాము... అంటే ఒకడు నీళ్లలో కొట్టుకుపోయాడు దేముడో అని అందరు శిష్యులు గొల్లుమని ఏడవసాగారు.

ఆ సమయంలో ఒక వ్యక్తి అటుగా వస్తూ, పరమానందయ్య శిష్యుల్ని పలకరించి ఏమిటి అలా ఏడుస్తున్నారు అని అడిగాడు. శర్మ చెప్పాడు అతికష్టం మీద ఏడుపు ఆపుకుంటూ, తమలో ఒకడు నీళ్ళలో కొట్టుకు పోయాడని.

అప్పుడా వ్యక్తి, అందర్నీ వరుసగా నించోబెట్టి లెక్కిస్తే 13 మంది ఉన్నారు. అందర్నీ లెక్కించి, తనని మాత్రం కలుపుకోకపోవటం వలన 13 మంది శిష్యుల బదులుగా 12 మంది లెక్కవచ్చింది. ఆ విషయమే, పరమానందయ్య గారి శిష్యులకి వివరించాడు ఆ వ్యక్తి.

## పరమానందయ్య శిష్యులు - జ్యోతిష్య బాధలు

పరమానందయ్య గారి శిష్యులు ఒకసారి వినాయకచవితి పండక్కి కావాల్సిన వెలగపండ్లు, వివిధ చెట్ల ఆకులు(పత్రి) తీసుకురావటానికి ముక్తేశ్వరం గ్రామ చివరన ఉన్న చిన్న అడివికి వెళ్ళారు. అక్కడ రకరకాల చెట్లు, పొదలు ఉన్నాయి. దాంతో గురువుగారి పని మర్చిపోయి కాసేపు ఆ అడవిలో అటూ, ఇటూ పరిగెత్తారు.

కాసేపు గెంతాటలు, పరిగెత్తే ఆటలు సాగినాక, కామేశం అనే శిష్యుడు మిగిలిన శిష్యుల్ని పిలిచి, ఒరేయ్ వెధవకానాల్లారా! మనం వచ్చింది దేనికి, వినాయకచవితికి కావాల్సిన సరంజామా తేవటానికి కదా! మరి ఆ పని వదిలేసి ఈ వెధవ గోల ఏమిటర్రా అని పెద్దగా అరిచాడు.

దాంతో శిష్యులకి అప్పుడు గుర్తుకు వచ్చింది తాము వచ్చిన పని గురించి, ఆపై హడావుడిగా కనిపించిన చెట్లు, మొక్కల ఆకులు సేకరించ సాగారు. ఒక శిష్యుడు ఉమ్మెత్తకాయల్ని సేకరించటానికి వెళ్ళి పొరపాటున



పెద్ద కొండచిలువని తొక్కి, ఆపై తాను తొక్కింది ఏమిటో గ్రహించి పెద్దగా అరుచుకుంటూ మిగిలిన శిష్యుల దగ్గరికి పరిగెత్తాడు.

ఇంకో శిష్యుడు జిల్లేడు కాయలు కోయటానికి ఒక జిల్లేడు పొదలో చేయి పెట్టగా, ఆ ఆకుల మధ్య ఉన్న ఒక మండ్రగబ్బ కరిచింది. ఆ మండ్రగబ్బ దెబ్బకి, పెడబొబ్బలు పెడుతూ అటూ, ఇటూ పరిగెత్తాడు మరొక శిష్యుడు.

ఈ అల్లరి, గందరగోళం చూసిన ఇంకో శిష్యుడు శాస్త్రి, ఒరేయ్ ! దద్దమ్మల్లారా మీరు మరీ వెర్రివెధవలలాగా చేస్తున్నారు. కాస్త స్థిరంగా ఉండి, తొందరగా పత్రి సేకరించండి అని అరిచాడు. దాంతో శిష్యులంతా ఒకచోట చేరి సమావేశం పెట్టుకున్నారు.



అప్పుడు సుబుద్ధి అనే శిష్యుడు, శిష్యుల్ని మూడు జట్లుగా విభజించి, ఒక్కొక్కళ్ళకి ఒక్కో పని ఒప్ప చెప్పాడు. తాను మామిడి ఆకుల కోసం, గొడ్డలి తీసుకొని పెద్దమామిడి చెట్టు ఎక్కి ఆకులు నేలరాల్చసాగాడు. ఇంతలో సుబుద్ధికి ఒక ఆలోచన వచ్చింది. ఇలా ఆకులు రాల్చే బదులు, ఏకంగా ఒక పెద్ద కొమ్మగానీ నరికితే, బోల్డన్ని ఆకులు వస్తాయి. హాయిగా అందరూ కలిసి ఆ కొమ్మని లాక్కెళ్ళచ్చు అని.

ఆ ఆలోచన రాగానే చక, చకా ఒక పెద్ద కొమ్మపైన ఎక్కి, దాన్ని గొడ్డలితో తపీ, తపీమని నరకసాగాడు. సరిగ్గా అప్పుడే గేదెలు కాసుకునే గోపయ్య గేదెల్ని అడవిలోకి గడ్డి మేయటానికి వదిలి అటువేపు వచ్చాడు. చెట్టుకొమ్మపై కూర్చుని, అదే కొమ్మని నరుకుతున్న పరమానందయ్యగారి

శిష్యుడ్ని గుర్తుపట్టి, "ఏయ్! వెర్రి బాపడా! నువ్వు కూసున్న కొమ్మని నువ్వే నరుక్కుంటే ఆ కొమ్మకూలి క్రింద పడి సస్తావు" అన్నాడు.

గోపయ్య మాటలు విన్న సుబుద్ధి కొమ్మ నరకటం ఆపి, పోవోయ్ పెద్ద చెప్పొచ్చావ్ నీవేమన్నా పెద్ద జ్యోతిష్య పండితుడివా ఏమిటి? ఈ కొమ్మపై ఉన్న నేను ఎందుకు క్రింద పడతాను అన్నాడు. సుబుద్ధి అలా అలా కొట్టి, కొట్టీ చెట్టు కొమ్మని కూల్చేసాడు, ఆ కొమ్మతో బాటే తనూ క్రిందపడి, చచ్చాన్రోయ్ అని పెద్దగా అరిచాడు.

సుబుద్ధి అరుపువిన్న, మిగిలిన శిష్యులు గావుకేకలు వేస్తూ, సుబుద్ధికి ఏదో అయింది చూద్దాం పదండి అని గోలగా అరుస్తూ సుబుద్ధి క్రిందపడ్డ చెట్టు దగ్గరికి వచ్చారు. అందరూ కలిసి కూలిన కొమ్మలోనుంచి, సుబుద్ధిని బయటికి లాగారు.

ఇదంతా చూస్తున్న గేదెల గోపయ్య, ఒరే పిచ్చి సన్నాసీ, నేను ముందే చెప్పానుగా, కూర్చున్న కొమ్మని నరుకుతున్నావు క్రిందపడతావని అన్నాడు. అప్పుడు సుబుద్ధి మిగిలిన శిష్యులతో, నిజమేరా అతను చెప్పినట్టుగానే క్రిందపడ్డాను అని గోపయ్యతో నువ్వా ఖచ్చితంగా మా గురువుగారిలా బ్రహ్మజ్ఞానివి అని గోపయ్య కాళ్ళపై పడి దండం పెట్టాడు.

అది చూసి మిగిలిన శిష్యులు కూడా గోపయ్యకి దండం పెట్టి, ఇలా అడిగారు. "అయ్యా గేదెల గోపయ్యగారూ.. మాకు మా గురువుగారు తండ్రితో సమానం. అలాంటి ఆయన కనుక మరణించారంటే, మేం దిక్కుమాలిన వాళ్ళం అవుతాం. మీరు మీ జ్యోతిష్యశాస్త్ర జ్ఞానం ఉపయోగించి, మా గురువుగారు ఎలా చనిపోతారో చెప్పండి."

అప్పుడు గేదెల గోపయ్య ఎగతాళిగా ఇలా అన్నాడు, మీ గురువుగారు ఎప్పుడైతే మధ్యాహ్నం వేళల ఆవులిస్తారో, ఆ మరుక్షణమే మరణిస్తారు అని చెప్పి గోపయ్య చల్లగా అవతలకి జారుకున్నాడు.

గోపయ్య మాటలు విన్న పరమానందయ్యగారి శిష్యులు, వినాయకచవితి పత్రి విషయం మర్చిపోయి వేగంగా ఇంటికి చేరారు. అప్పటికి మధ్యాహ్నం అయింది. పరమానందయ్యగారు భోజనం ముగించి, వాకిట్లో అరుగు మీద కూర్చుని తాంబూలం సేవిస్తున్నారు.



సరిగ్గా అప్పుడే ఆడవి నుండి తిరిగి వస్తున్న శిష్యుల్ని చూసి, ఏరా అబ్బాయిలూ! వినాయకుడి పత్రి తేలేదేం అన్నాడు. శిష్యులు ఏమీ మాట్లాడకుండా గురువుగారిని చూస్తూ నిలుచున్నారు. సరిగ్గా అప్పుడే గురువుగారికి భుక్తాయాసం వల్ల నిద్రముంచుకు వచ్చి, పెద్దగా ఆవులించారు.

అంతే శిష్యులు గురువుగారి దగ్గరికి వెళ్ళి, అయ్యో గురువుగారూ.... మీరు ఇకపై ఆవులించకండి అన్నారు ఆందోళనగా. గురువుగారు ఆశ్చర్యపడి, అదేంటిరా అన్నారు. గేదెల గోపయ్య చెప్పిన జోస్యం గురించి ఆయనకి చెప్పారు శిష్యులు. శిష్యుల తెలివితేటలకి గురువుగారికి మాటలు రాలేదు.

## కిష్కింధాకాండ

పూర్వకాలంలో యానాదిభాగవతలు అనే గ్రామీణ నాటక కళాకారులు ఉండేవారు. పౌరాణిక నాటకాలు రాత్రిపూట వేసేవాళ్ళు. ఒక్కోగ్రామంలో ఒక్కో రాత్రి ఏదో ఒక పౌరాణిక నాటకం వేయటం ఆ కళాకారుల పద్ధతి. అలాగే ఒకసారి వాళ్ళు పరమానందయ్య గారు ఉంటున్న ముక్తేశ్వరం గ్రామంలో ఒక రాత్రి 'కిష్కింధాకాండ' అనే నాటకం వేసారు.

రావణాసురుడు, సీతను దొంగతనంగా ఎత్తుకెళ్ళిపోయినపుడు, రాముడి దూతగా హనుమంతుడు సముద్రం దాటి వెళ్ళి లంకలో ఉన్న సీతను చూస్తాడు.

ఆ తర్వాత లంకానగరంలోని భవనాలకి తన తోకకి రాక్షసులుపెట్టిన నిప్పును అంటిస్తాడు. పరమానందయ్యగారు, ఆయన శిష్యులు ఈ నాటకానికి వెళ్ళి చూసి వచ్చారు.

ఆయన శిష్యులకి ఈ నాటకం బాగా నచ్చింది. అందులోనూ, ఆంజనేయుడు తోకతో అన్నీ అంటించి వేయటం, లంక దహనం చేయటం మరీ నచ్చింది.

తాము కూడా ఎలాగైనా లంకా దహనం నాటకం వేయాలని మనస్సులో నిశ్చయించుకొని, సమయం కోసం ఎదురు చూడసాగారు.

ఒకసారి పరమానందయ్య గారి ఇంటికి మరమ్మత్తులు చేసి, సున్నం కొట్టటానికి ఇంట్లో సామానులు, ఊరగాయ జాడీలు, బూరుగ దూది పరుపులు, దిళ్ళు, ఇంటి ఎదురుగా ఉన్న గురువుగారి తోటలో ఉంచి, కూలీలు ఇంటి పనులు చేయసాగారు.

పని పూర్తి అయింది. కూలీలు వెళ్ళిపోయారు. పరమానందయ్యగారు, ఆయన భార్య, కూతురు పక్కింటి ఆచారిగారింట్లో భోజనం చేసి హాయిగా నిద్రపోతున్నారు. శిష్యుల్ని తోటలో వేసిన సామానులు, బట్టలు చూడమని చెప్పటం జరిగింది.

గురువుగారి సామానులకి కాపలాకాస్తున్న శిష్యులకి ఒక ఆలోచన వచ్చింది. అదేమంటే తాము, ఇప్పుడు కిష్కంధాకాండ నాటకం వేయాలని. ఆలోచన రావటం తరువాయి, శిష్యులు ఎవరి వేషం ఏమిటో, క్షణాల్లో నిర్ణయించుకున్నారు. అందులో శాస్త్రి ఆంజనేయుడి వేషం కట్టాడు. మిగిలిన శిష్యులు రాక్షసుల వేషం కట్టారు.

ఇంకేముంది అక్కడ కిష్కింధాకాండ మొదలయింది. ముందుగా ఆంజనేయుడి వేషం కట్టిన శాస్త్రి ఒక మామిడి చెట్టు ఎక్కి, ఒక కొమ్మపై కూర్చుని, చెట్టుకున్న మామిడికాయలు తెంపి, క్రింద ఉన్న శిష్యులపై విసరసాగాడు. ఒక పెద్దకాయ, రాక్షసుడి వేషం కట్టిన శర్మ బుర్రపై ఠంగుమని తగిలి, పెద్ద బొప్పి కట్టింది.

దాంతో శర్మకి తిక్కరేగి, చెట్టు మీదున్న శాస్త్రి మీదకు, క్రింద నుంచి ఒక రాయి విసిరాడు. ఇది చూసిన మిగిలిన శిష్యులు కూడా, చెట్టు మీదున్న ఆంజనేయుడి మీదకి చేతికి అందినవన్నీ విసరసాగారు. ఆ విసిరినవి అన్నీ తగిలి, ఆంజనేయుడికి విపరీతం అయిన కోపం వచ్చి, ఓరీ రాక్షసాధములారా! మీ అంతు చూస్తాను, మీరు ఇంక యమలోకానికి వెళ్ళక తప్పదు అని ఛెంగున చెట్టుపై నుండి క్రిందికి దూకాడు.

ఆ తర్వాత ఒక పెద్ద దుడ్డు కర్ర తీసుకొని, గదలా భుజాన పెట్టుకొని, శిష్యుల వెంటపడ్డాడు. మిగిలిన శిష్యులు గురువుగారి సామాన్లపై ఎక్కి, అటు, ఇటు పరిగెడుతూ, ఆంజనేయుడిపై రాళ్ళు విసరసాగారు. దాంతో ఆంజనేయుడు, తన దుడ్డుకర్రతో శిష్యుల్ని బాదటం మొదలు పెట్టాడు.



శిష్యులు అటు ఇటు పరిగెడుతూ, ఆంజనేయుడిని మాటలతో ఇంకా, ఇంకా, రెచ్చకొట్టసాగారు. దాంతో ఆంజనేయుడికి వెర్రి కోపం వచ్చింది.

అంతే ఆ దుడ్డకర్రతో బయట పెట్టిన సామాన్లలో ఉన్న ఆవకాయ, మాగాయి, చింతకాయి, ఉన్న పెద్ద, పెద్ద జాడీలను పగలగొట్టాడు. దాంతో ఆ జాడీల నుండి ఊరగాయలు సామాన్లపై కారిపోయాయి. ఆపై గురువుగారి బూరుగు దూది పరుపుని, చించేసి, అందరి మీదా వెదజల్లాడు.

దాంతో మిగిలిన శిష్యులు, ఆంజనేయుడిని పట్టుకొని అతడి తోకకి నిప్పు అంటించి, వదిలారు. అంతే కిష్కింధాకాండ పతాకస్థాయికి చేరింది. ఆంజనేయుడు అటు, ఇటు పరిగెడుతూ, దుడ్డుకర్రతో, శిష్యుల్ని బాదుతూ, మధ్య, మధ్య 'జై శ్రీరాం' అని నినాదాలు చూస్తూ, గురువుగారి బట్టలకి పురాతన కాలం నుండి వస్తున్న తాళపత్ర గంథ్రాలకి బూరుగదూది దిళ్ళకి, పరుపులకి నిప్పు పెట్టాడు.

దాంతో నిప్పు మంటలుగా మారింది. అసలే ఎండాకాలం మిట్ట మధ్యాహ్నం కావటంతో తోటలోని ఎండకొమ్మలు కూడా అంటుకుని, పెద్ద శబ్దంతో, గురువుగారి సామానులు మంటల్లో మండిపోసాగాయి. ఈ



గోలకి ప్రక్కింట్లో నిద్రపోతున్న గురువుగారి కుటుంబానికి మెలుకువ వచ్చి, కంగారుగా తోటవైపు వచ్చి చూస్తే, ఏముంది, పెద్దమంటలు, గందరగోళం. ఈ అరుపులు, గోల విని, ఊళ్ళోని జనం గుంపులు, గుంపులుగా వచ్చి, నీళ్ళు చల్లి, ఆ మంటల్ని ఆర్పారు.

తాము వేసిన కిష్కింధాకాండ నాటకం ఎలా ఉన్నది అని గర్వంగా అడుగుతున్న శిష్యులకేసి పిచ్చిచూపులు చూడటం గురువుగారి వంతు అయింది.

## ఒక ఆజ్ఞ - నాలుగు కార్యాలు

పరమానందయ్యగారి శిష్యులు ఒకసారి, గురువుగారికి అనారోగ్యం వస్తే ఏం చేసారో తెలిస్తే ఆశ్చర్యం, ఆందోళన కలుగుతాయి. ఒకరోజు గురవుగారికి తీవ్రమైన శిరోవేదన కల్గి, ఇద్దరు శిష్యుల్ని పిలిచి, “ఒరేయ్ నాయనలారా! తలనొప్పి తీవ్రంగా ఉన్నది. మీరు వెంటనే బయలుదేరి ప్రక్క గ్రామంలో ఉన్న ఆయుర్వేద వైద్యుడు ఆచారిగారిని పిలుచుకురండి” అన్నారు.

ఇంకేముంది శిష్యులు పదమూడమంది కోలాహలంగా బయలుదేరారు. ప్రక్క ఊరు పదిమైళ్ళ దూరంలో ఉన్నది. దాంతో శిష్యులంతా మంచి, చెడు మాట్లాడుకుంటూ ప్రక్క గ్రామానికి నడక ప్రారంభించారు.

మాటల మధ్యలో పెద్ద శిష్యుడు శాస్త్రి, “ఒరేయ్ సోదరులారా! మన గురువుగారు వైద్యుడ్ని తీసుకురమ్మని మనల్ని ఆజ్ఞాపించారు. అంటే ఆయన మనల్ని ఒక్క పని చేయమన్నారు. మనం గానీ నాలుగు పనుల్ని చేసామంటే, మన తెలివితేటలు గురువుగారికి బాగా అర్థం అవుతాయి, ఏమంటారు” అన్నాడు.

అప్పుడు శాస్త్రి, “ఒరేయ్! దద్దమ్మా, నాలుగు పనులూ నీవు ఒక్కడివే చేయాల్సిన పని లేదు. ఎవరికి తోచిన పని వాళ్ళు చేద్దాం సరేనా” అన్నాడు. అందరికీ శాస్త్రి చెప్పిన మాటలు నిజంగా నచ్చాయి. ముందుగా శర్మ వైద్యుడి దగ్గరికి వెళ్ళి, వైద్యుల వారిని వెంటపెట్టుకుని, గురువుగారి ఇంటికి బయలుదేరాడు.

ఈలోగా ఇద్దరు శిష్యులు ఇలా ఆలోచించారు. ఖర్మాకాలి గురువుగారు కానీ చనిపోతే, ఆయని ఇంక చూడటం వీలుకాదు కనుక, ఆయన



విగ్రహాన్ని కానీ తయారు చేయించి ఆ విగ్రహాన్ని గురువుగారి ఇంటి ముందు ప్రతిష్టిస్తే, గురువుగారిని చూసినట్టుగా ఉంటుంది.

ఈ ఆలోచన రాగానే ఆ ఇద్దరు శిష్యులూ విగ్రహాలు తయారుచేసే వీరాచారి ఇంటికి వెళ్ళి, గురువుగారి విగ్రహం తయారుచేయాలి, వెంటనే బయలుదేరి తమ వెంట రమ్మన్నారు. సరే వీరాచారి కావాల్సిన సామాగ్రి, ఒక మంచి శిలను తీసుకుని, ఒక బండీపై ఆ శిష్యులతో సహా గురువుగారింటికి బయలుదేరాడు.



ఇక మరో నలుగురు శిష్యులు ఆలోచించి, ఆలోచించి ఒక అద్భుతమైన ఆలోచన చేసారు. అదేమంటే గురువుగారి కర్మకాండలకి కావాల్సిన కట్టెలు, గంధపు చెక్కలు తీసుకుని వెళితే సమయానికి వెతుక్కునే పని తప్పుతుంది కదా అని. ఆలోచన రావటంతోనే వారు కట్టెలు, గంధపు చెక్కలు తీసుకుని ఒక పాడెపై వేసుకుని, నారాయణా, నారాయణా అనుకుంటూ ఆ పాడెను మోసుకొని, గురువుగారి దగ్గరికి బయలుదేరారు. వాళ్ళకి మహా ఆనందంగా ఉన్నది, తమ తెలివితేటలకి గురువుగారు తమని తెగ పొగిడేసారు అని.

మరో ఆరుగురు శిష్యులు తద్దినాలు పెట్టించే కరకటశాస్త్రి దగ్గరికి వెళ్ళారు. కరకట శాస్త్రి వాకిట్లో కూర్చుని జంధ్యాలు తయారుచేస్తున్నాడు. ఈ మధ్య ఎవరూ చావకపోవటంతో, ఆయన తీరిగ్గా ఉండి, ఏమీ తోచక జంధ్యాలు పేనుకుంటున్నాడు.

పరమానందయ్యగారి శిష్యులు కరకట శాస్త్రిని కలిసి, వెంటనే బయలుదేరండి, అవతల మా గురువుగారికి కర్మలు చేసే సమయం దాటిపోతుంది అన్నారు.

దాంతో కరకట శాస్త్రి హడావుడిగా తద్దినానికి కావాల్సిన సరంజామాతో బయలుదేరాడు. ఆ ఆరుగురు శిష్యులు కరకట శాస్త్రితో కలిసి గ్రామం వదిలి, గురువుగారి దగ్గరకు బయలుదేరారు.

ఇక్కడ పరమానందయ్యగారికి తలపగిలే తలనొప్పి. అబ్బా, అమ్మా అని మూలుగుతూ, మంచంపై అటు, ఇటు దొర్లసాగారు. వైద్యుడ్ని తెమ్మని పంపిన శిష్యుల జాడ ఐనా కనపడటం లేదు. ఆయన కోపంగా శిష్యుల్ని తిట్టుకోసాగారు. ఇదంతా చూస్తున్న గురువుగారి భార్య, ఏదో కషాయం కాచి గురువుగారికి తాగించింది.

అది తాగాక ఆయనకి తల నొప్పి కాస్త తగ్గ ముఖం పట్టి వాకిట్లో అరుగుమీద ఆసనం వేసుకొని అలా చల్లగాలి తగిలేలా కూర్చున్నారు. సరిగ్గా అప్పుడు దిగారు శిష్యులు, వాళ్ళ వెంట వైద్యుడు, శిల్పి, కట్టెలు, పాడె, తద్దినాలు పెట్టించే కరకట శాస్త్రి.

వీళ్ళంతా ఎందుకు వచ్చారో అర్థం కాని గురువుగారు, శాస్త్రిని పలిచి, "ఎవర్రా వాళ్ళంతా, ఏంటి పాడె, కట్టెలు తెచ్చారు" అన్నారు మహా ఆందోళనగా. అప్పుడు శాస్త్రి వినయంగా "ఇలా అన్నాడు. గురువుగారూ, మీరు వైద్యుడిని తీసుకురమ్మన్నారు.

కానీ ఒక్క ఆజ్ఞ ఇస్తే – నాలుగు పనులు చేయాలని మీరేగా ఒకసారి అన్నారు. అందుకే ఒకవేళ మీరు గాని చనిపోతే మళ్ళీ, మళ్ళీ వెళ్ళాల్సిన పనిలేకుండా మీ దహనానికి కావాల్సిన కట్టెలు, పాడె, మీ కర్మలు చేయటానికి పురోహితుడు, మీ విగ్రహాన్ని తాయారు చేయటానికి శిల్పిని తెచ్చాం చూసుకోండి. మీరు వైద్యుడ్ని తెమ్మంటే, మేం ఇంకా ముగ్గుర్ని తెచ్చాం."

శిష్యులు మూర్ఖత్వం చూసిన గురువుగారు ఏం మాట్లాడాలో తెలీక దిక్కులు చూడసాగారు.



# పరమానందయ్య శిష్యుల ప్రత్యక్ష పురాణం

పరమానందయ్యగారికి తన శిష్యులు గొప్ప పండితులు అని ఓ నమ్మకం ఉండేది. పరమానందయ్యగారు పురాణాలు గొప్పగా చెపుతారని పేరు ఉన్నది. ఆయన ఎక్కడ పురాణాలు చెప్పినా తన శిష్యుల్ని వెంట తీసుకెళ్ళటం ఆయనకు అలవాటు.

అయితే ఆయన ఒకసారి తన శిష్యులతో ఇలా అన్నారు. "ఒరేయ్ అబ్బాయిలూ! మీరు కూడా పురాణాలు బాగా చెప్పి, నా అంత పేరు తెచ్చుకోవాల్రా" అన్నారు. ఈ మాటలు విన్న ఆయన శిష్యులు, అబ్బా! పురాణాలు చెప్పటం మాకు వెన్నతో పెట్టిన విద్యకాదుటండీ అన్నారు చాలా ఉత్సాహంగా.

అయితే ఈ రాత్రి చిన్నాపురం గ్రామ కరణంగారింట్లో మీరే పురాణం చెప్పండి అన్నారు. శిష్యులు అలాగేనండీ తప్పకుండా, ఈ రోజు రాత్రి అందరం చెపుతాము అన్నారు. సరే రాత్రి అయింది, పరమానందయ్యగారు, ఆయన శిష్యులు పట్టుపంచెలు కట్టి, రంగు, రంగుల శాలువాలు కప్పుకొని ఘనంగా నడుస్తూ, కరణంగారింటికి వెళ్ళారు.

కరణంగారిల్లు రెండు అంతస్థుల మేడ. రెండో అంతస్థుపైన ఉన్న మిద్దె మీద పురాణ కాలక్షేపం జరపాలని నిర్ణయించబడింది. పరమానందయ్యగారు, శ్రోతలకు ఇలా చెప్పారు. ఈ రోజున నా శిష్యులు నా బదులుగా పురాణం చెపుతారు, మీరంతా శ్రద్ధగా విని, వాళ్ళని ప్రోత్సహించండి.

పరమానందయ్యగారి మీదున్న విశ్వాసం వల్ల, ఆయన శిష్యులు చెప్పే పురాణం వినటానికి శ్రోతలు సిద్ధం అయ్యారు. ఒక శిష్యుడు లేచి "అయ్యలారా మీకు భాగవతం అంటే తెలుసా?" అని అడిగారు. అప్పుడు ఒక కుర్రశ్రోత, నాకు తెలీదు స్వామి" అన్నాడు.

అప్పుడు పురాణం చెప్పటానికి లేచిన శిష్యుడు ఇలా అన్నాడు "భాగవతం అంటే తెలీని వాళ్ళకి ఆ పురాణం చెప్పటం వృధా" అని కూర్చున్నాడు. తర్వాత ఇంకో శిష్యుడు పురాణం చెప్పటానికి లేచి,

నాయనలారా, మీకు భాగవతం అంటే తెలసా అన్నాడు. అప్పుడు శ్రోతలు ఇలా అనుకున్నారు.

భాగవతం తెలీదు అంటే, తెలియని వాళ్ళకి చెప్పటం దండగ అని అసలు పురాణమే చెప్పలేదు. కనుగ భాగవతం తెలుసు అంటే, పురాణం చెపుతారని భావించి, ఒక స్త్రీ లేచి, భాగవతం అంటే మాకు బాగా తెలుసు అన్నది.

అప్పుడు పురాణం చెప్పటానికి లేచిన శిష్యుడు, తెల్సిన వాళ్ళకి చెప్పటం వృధా అని కూర్చున్నాడు, కానీ పురాణం చెప్పలేదు.

చివరగా సుబుద్ధి లేచి భక్తులారా మీకు భాగవతం అంటే తెలుసా అన్నాడు విసుగ్గా. దాంతో శ్రోతలు రెండు వర్గాలుగా చీలి, ఒక వర్గం భాగవతం అంటే తెలుసు అని, మరొక వర్గం తెలీదు అని అన్నారు. అప్పుడు సుబుద్ధి ఇలా అన్నాడు.

"అయ్యలారా! మీలో భాగవతం అంటే తెలిసిన వాళ్ళు తెలియని వాళ్ళకి చెప్పండి. ఇదే నా సలహా" అని కూర్చున్నాడు.

దాంతో పరమానందయ్యగారికి అర్థమయింది తన శిష్యుల సత్తా. ఆ తర్వాత ఎప్పుడూ ఆయన తన శిష్యుల్ని పురాణం చెప్పమని అడగలేదు.

## అరిసెలతో ఆత్మహత్య

పరమానందయ్యగారి అమ్మాయికి ఒక ధనికుల సంబంధం దొరికింది. పైసా కట్నం లేకుండా, గురువాగిరి అమ్మాయిని పెళ్ళాడతానని వచ్చిన పెళ్ళికొడుకు వ్యాధిగ్రస్తుడు అని శిష్యుల అతితెలివి చర్యల వల్ల తెలుసుకున్న పరమానందయ్యగారు శిష్యుల్ని మెచ్చుకున్నారు. తన కూతురి జీవితాన్ని కాపాడారని శిష్యుల తెలివిని ఆకాశానికి ఎత్తేశారు ఆ గురువుగారు.

అయితే గురుపత్ని పెళ్ళికొడుకి అనారోగ్యం విషయం తెలియక ముందు ఆ సంబంధం తప్పిపోయినందుకు చాలా బాధపడి ఈ విధంగా అన్నది. "ఒరేయ్! మీకేమన్నా సిగ్గు, శరం ఉంటే ఎందులోనైనా దూకి చావండి లేదా విషం తిని ఆత్మహత్య చేసుకోండి" అని తీవ్రంగా నిందించింది.



దాంతో పరమానందయ్యగారి శిష్యులకి తీవ్ర బాధ, ఆవేదన కలిగి, ఏమైనా సరే విషం తిని చావటం బాగుంటుంది అని నిర్ణయించుకున్నారు. అయితే వాళ్లకి విషం ఎవరు ఇస్తారు. పోనీ వాళ్ళే వెళ్ళి ఆ విషాన్ని తెచ్చుకుందామంటే, అది ఎక్కడ లభిస్తుందో వాళ్ళకి తెలీదు.



దాంతో విషం ఎలా లభిస్తుందో అర్థంకాక బుర్రలు చించుకోసాగారు. అప్పుడు వారిలో ఒక శిష్యుడు ఇలా అన్నాడు. "రేయ్ అన్నయ్యలూ! మొన్న రాత్రి గురువుగారి భార్య అరిసెలు వండి, ఒక కుండనిండా, వంటగదిలో దాచి పెట్టింది. అవేంటండీ అమ్మగారూ, అని నేను అడిగితే ఇది విషం రా నాయనా, తింటే ఛస్తావు జాగ్రత్త' అని అన్నారు అని చెప్పాడు.

అప్పుడు మిగిలిన శిష్యులు, సరే, అవి విషపు అరిసెలు కనుక వాటిని తిని చద్దాం అని నిర్ణయించుకున్నారు.

అందరూ ఊరి చివర ఉన్న చెరువు గట్టుపైన కూర్చుని, వాళ్ళలో ఒక శిష్యుడిని, విషం కలిపిన అరిశెలు తీసుకురమ్మని పంపారు. ఆ శిష్యుడు పిల్లిలాగా వంట ఇంట్లోకి దూరి, ఆ అరిసెలు ఉంచిన కుండని ఎత్తుకొని, ఎవరికీ తెలీకుండా నిశ్శబ్దంగా చెరువు గట్టుకి చేరాడు.

ఆ శిష్యుడు రాగానే, అరిసెల కుండని క్రింద పెట్టాడు. అందరూ ఆఖరిసారిగా దైవ ప్రార్థన చేసి, తలో నాలుగు అరిసెలు నమలసాగారు.

అప్పుడు శాస్త్రి అనే శిష్యుడు, ఒరేయ్ తమ్ముళ్ళూ! ఈ విషపు అరిసెలు చాలా రుచిగా ఉన్నాయి సుమీ అన్నాడు.

దాంతో మిగిలిన శిష్యులు కూడా విషపు అరిసెలు చాలా రుచిగా, దివ్యంగా ఉన్నాయని చెప్పుకుంటూ వందమందికి సరిపోయే అరిసెల్ని ఆ 13 మంది శిష్యులే లాగించారు.

కానీ వాళ్ళు ఊహించినట్టుగా చావలేదు. కారణం అవి మామూలు అరిసెలే. కేవలం, పెళ్ళి వారికి చేసిన అరిసెలని వాళ్ళు తింటారని అనుమానించిన గురువుగారి భార్య అవి విషపు అరిశెలని వారికి అబద్ధం చెప్పింది.

## పాదసేవ పోటీలు

పరమానందయ్యగారి శిష్యులకి ఉండే గురుభక్తికి అంతే లేదు. ఒకసారి గురువుగారికి బాగా నీరసంగా ఉండి ఒక చాపపై పడుకున్నారు. అప్పుడు సుబుద్ధి అనే శిష్యుడు వచ్చి, అయ్యా గురువుగారూ! మీకు చాలా సుస్తీగా ఉన్నట్టుంది. మీ కాళ్ళు ఒత్తమంటారా అన్నాడు ఆపేక్షగా.

సుబుద్ధి మాటలు విన్న పరమానందయ్యగారు, సరేరా బాబు! నా కాళ్ళు వత్తు అన్నారు, శిష్యుడి గురుభక్తికి బాగా పొంగిపోతూ. దాంతో సుబుద్ధి గురువుగారి కాళ్ళ దగ్గర కూర్చుని మోకాళ్ళ దగ్గరనుండి పాదాల దాకా చాలా నేర్పుగా, శ్రద్ధగా వత్తసాగాడు.

గురువుగారికి హాయిగా అనిపించి నిద్రలోకి జారుకున్నారు. ఇక్కడ ఇలా ఉండగా, శర్మ అనే పరమానందయ్యగారి ఇంకో శిష్యుడు హడావుడిగా, బయటికి వెళ్ళి అక్కడ గోపూజ చేస్తున్న మిగిలిన శిష్యులకి, సుబుద్ధి ఒక్కడే గురువుగారి పాదసేవ చేస్తూ, మంచి శిష్యుడు అనిపించుకుంటున్నాడు అన్న వ్తార చేరేసాడు.

దాంతో మిగిలిన శిష్యులు ఆవు పూజ సంగతి మర్చిపోయి, గబ, గబా గురువుగారి దగ్గరికెళ్ళి నిద్రపోతున్న గురువుగారిని నిద్రలేపి, అయ్యా గురువుగారు, సుబుద్ధి లాగా, మేం కూడా మీ పాదసేవ చేసి తరిస్తాం అనుమతించండి అన్నారు.


సగం నిద్రలో ఉన్న పరమానందయ్య గారు, సరేరా, అందరూ నాకు సేవచేయండి అన్నారు. అంతే శిష్యులందరూ గురువుగారి శరీరాన్ని, అవయవాల వారీగా వంతులు వేసుకుని పిసకసాగారు. ఒక శిష్యుడు కుడికాలు నాది అని, ఆ కాలు రెండు చేతులతో పట్టుకొని, నొక్క సాగాడు.

ఇంకో శిష్యుడు, పరమానందయ్యగారి ఎడమకాలిని ఒడిసి పట్టుకొని కసా, కసామని పిసకసాగాడు. ఇద్దరు శిష్యులు, పరమానందయ్య గారి రెండు చేతులు, చెరి ఒకటి పంచుకొని పిసకసాగారు. కాళ్ళు, చేతులు పంచుకుంటే నల్గురి శిష్యులకి సరిపోయాయి.

మరి మిగిలిన తొమ్మిది మంది శిష్యులు ఏం చేయాలి, అందుకే ఆ తొమ్మిది మంది పరమానందయ్య గారి వీపు, మెడ, తలను పంచుకుని ఎడా, పెడా ఆ భాగాలను నొక్కసాగారు.

దాంతో పరమానందయ్య గారికి ప్రాణం పోయినంత పని అయి, ఒరేయ్ మూర్ఖుల్లారా! నన్ను వదలండిరా, మీరూ వద్దు, మీ సేవా వద్దు అని అరవసాగారు.

అయినా వినే వాళ్ళేరి. చివరికి శిష్యులు తమ వంతుగా వచ్చిన భాగం, ఇతరుల వంతుగా వచ్చిన భాగం కంటే మంచిది అని వాదించుకొని, అరుచుకొన్నారు.

చివరికి వాళ్ళలో ఆగ్రహావేశాలు పెరిగిపోయాయి. దాంతో అంజి అనే శిష్యుడు, రేయ్ నా గురువుగారి కుడికాలే మంచిదిరా, గురువుగారి ఎడమ కాలు చెడ్డది.... దాన్ని వెంటనే నరికేస్తానని గొడ్డలి తెచ్చాడు. దాంతో మిగిలిన శిష్యులు కూడా, గురువుగారి ఇతర శరీర భాగాలు చెడ్డవి అని నరకటానికి కత్తులు, కత్తిపీటలు తీసుకొని పరమానందయ్యగారి కేసి రాసాగారు.

దాంతో పరమానందయ్యగారికి గుండె ఆగినంత పని అయింది. ఇంకో నిముషం ఉంటే, ఆ మూర్ఖ శిష్యులు, గురువుగార్ని ముక్కలు, ముక్కలుగా నరికి ఉండేవాళ్ళే, కానీ అదృష్టవశాత్తూ, గురుపత్ని, రాబోయే ప్రమాదాన్ని గ్రహించి, ఒక బెత్తం తీసుకొని, పరమానందయ్యగారి శిష్యులకి తలా రెండు దెబ్బలు వడ్డించింది.

అప్పటికి కానీ, ఆ మూర్ఖ శిష్యులకు తమ తప్పు అర్థంకాలేదు. తాము వాటాలు వేసుకున్నది, గాయపర్చాలని ప్రయత్నించింది, తమ గురువుగారినే అని.

## ఎవరు చవట?

ఒకసారి పరమానందయ్యగారు పురాణ పఠనం చేయటానికి రామాపురం అనే గ్రామం వెళ్ళారు. ఆయనతో పాటు శిష్యుల్ని కూడా తీసుకెళ్ళారు. వాళ్ళకి ఆ వూరిగ్రామ కరణంగారింట్లో బస, భోజనాలు ఏర్పాటు చేయబడ్డాయి.

సాయంకాలం కాగానే ఆ వూరి దేవాలయ ఆవరణలో పురాణ కాలక్షేపం మొదలయింది. పరమానందయ్యగారి శిష్యులు గురువుగారికి ఎదురుగుండా, ప్రేక్షకులలో కలిసి కూర్చుని గురువుగారి పురాణం వినసాగారు. ఆ సమయంలో గురువుగారు, వేశ్యల వల్ల సమాజానికి ఎంత నష్టం కలుగుతుందో చక్కగా వివరిస్తున్నారు.

అందరూ ఆసక్తిగా గురువుగారు చెప్పిన నీతివాక్యాలను శ్రద్ధగా విన్నారు. రాత్రి 12 గంటల దాకా పురాణ కాలక్షేపం జరిగింది. ఆ తర్వాత గురువుగారు, ఆయన శిష్యులు తమ బసకు నడుచుకుంటూ వెళ్ళసాగారు. మధ్య మార్గంలో సుబుద్ధి అనే శిష్యుడు గురువుగారిని ఇలా అడిగాడు.

"గురుదేవా! తమరు వేశ్యల గురించి బాగా వివరించారు. ఇంతకీ వేశ్యలు అంటే ఎవరు, మన భూలోకంలోనే ఉంటారా? లేక ఆకాశంలో ఉంటారా?".

శిష్యుడి మాటలు విని, పరమానందయ్యగారు పెద్దగా నవ్వి, "వేశ్యలు అంటే మనుషులేరా బాబూ... కాకుంటే వాళ్ళ వృత్తి వల్ల సమాజానికి చాలా నష్టం" అన్నారు.

దాంతో మిగిలిన శిష్యులు "అయితే గురువుగారూ! వేశ్యలు కూడా మనుషులే అయితే, ఈ ఊళ్ళో కూడా వాళ్ళు ఉన్నారా" అని అడిగారు. "ఆహా! ఈ ఊరి పొలిమేరలలో ఉన్న రెండు పెద్ద భవనాలు వేశ్యలవే" అన్నారు పరమానందయ్యగారు.



ఇంతలో వాళ్ళ బస రావటంతో, వేశ్యల గురించి జరిగే చర్చ ఆగిపోయింది. అందరూ బసకెళ్ళి నిద్రపోయారు.

మర్నాడు మధ్యాహ్నం భోజనాలు పూర్తి అయి, గురువుగారు నిద్రకు ఉపక్రమించగానే, ఆయన శిష్యులు మెల్లిగా బయటికి జారుకున్నారు. అలా బయటికి వెళ్ళిన ఆ శిష్యులు ఊరి పొలిమేరలో ఉన్న వేశ్యల ఇంటి వైపు నడవసాగారు.

వేశ్యలు అంటే ఎలా ఉంటారో చూద్దామని వారి ఉద్దేశ్యం. అలా నడుస్తూ, నడుస్తూ, వాళ్ళు ఊరి పొలిమేరలో ఉన్న వేశ్యాగృహాల దగ్గరికి వచ్చారు.

విచిత్రంగా ఉన్న పరమానందయ్య శిష్యుల ఆకార, వికారాలు చూసి ఒక ఇంటి మేడపై ఉన్న ఒక యువవేశ్య ఫక్కున నవ్వింది.

ఆమె నవ్వటం చూసిన పరమానందయ్యగారి శిష్యులు చర, చర నడుచుకుంటూ, ఆ వేశ్య ఇంటిలోకి ప్రవేశించారు. వాళ్ళ రాకను గమనించిన యువ వేశ్య మేడమెట్లు దిగి, క్రిందికి వచ్చి, పరమానందయ్య గారి శిష్యుల్ని పలకరించింది.



ఆమె కనబడగానే, శిష్యులు "ఏయ్ అమ్మాయీ! మమ్మల్ని చూసి ఎందుకు నవ్వావు" అని కోపంగా అడిగారు ఆమెని. వాళ్ళ కోపం, అమాయక ప్రవర్తన చూసి జాలిపడ్డ ఆ యువ వేశ్య, ఇలా అన్నది. ఓ బాపనయ్యలారా! నేను మిమ్మల్ని అందర్నీ చూసి నవ్వలేదు. మీలో ఉన్న ఒక వెర్రివెంగళప్పను చూసి, మాత్రమే నవ్వాను.

వేశ్యమాటలు విన్న శిష్యులు, వేశ్య ఇంటిలోంచి బయటికి వచ్చి మనలో వెర్రివెంగళప్ప ఎవరు? అని తీవ్ర ఆలోచనలు, తర్జన భర్జనలు చేసుకున్నారు. వాళ్ళకి తేలలేదు. వాళ్ళలో ఎవరు నిజమైన వెర్రివెంగళప్ప అని వాదించుకోసాగారు.

అలా వాదించుకుంటూ ఉన్న వారిని గ్రామ రహదారిలో వెళ్తున్న ఒక వృద్ధుడు చూసి, నాయనలారా! ఎవరు మీరు, మీలో మీరే పోట్లాడుకుంటున్నారు ఎందుకు అని ప్రశ్నించాడు.

అప్పుడు ఒక శిష్యుడు ఆ వృద్ధుడితో ఇలా అన్నాడు. తాతా! నీవైనా చెప్పు మాలో నిజమైన వెర్రివెంగళప్ప ఎవరో అన్నాడు ఆవేశంగా. మిగిలిన శిష్యులు కూడా వంతులేసుకుని వృద్ధుడ్ని అడిగారు తమలో నిజమైన వెర్రివెంగళప్ప ఎవరూ అని.

దాంతో ఆ వృద్ధుడు, నాయనలారా మీరు పరమానందయ్యగారి శిష్యులు కాదు కదా? అన్నాడు అనుమానంగా. దాంతో శాస్త్రి అనే శిష్యుడు, తాతా... నీవు బుద్ధిశాలివి, మమ్మల్ని చూడగానే ఎలా గుర్తుపట్టావు, మేము పరమానందయ్యగారి శిష్యులమని అన్నాడు.

అప్పుడా వృద్ధుడు, నాకే కాదు నాయనా, మీ మాటలు విన్న ఎవరికైనా అర్థం అవుతుంది మీరు పరమానందయ్యగారి శిష్యులు అని తన దారిని, తాను చక్కా పోయాడు.

శిష్యులు గురువుగారి దగ్గరికి వెళ్ళి, గురుదేవా! మీరైనా చెప్పండి మాలో నిజమైన వెర్రివెంగళప్ప ఎవరో అన్నారు. అప్పుడు గురువుగారు, ఎవరు అసలైన వెర్రివెంగళప్ప అనే విషయం ఎందుకు చర్చిస్తున్నారు అన్నారు.

అప్పుడు శిష్యులు తాము వేశ్యల గురించి తెలుసకోవటానికి వెళ్ళటమూ, ఆపై ఒక యువవేశ్య నవ్వటం, ఎందుకు నవ్వావు అంటే ఆమె, నిజమైన వెర్రి వెంగళప్పను చూసి నవ్వానన్న విషయం వగైరా విషయాలను వివరించారు.

దాంతో పరమానందయ్యగారు శిష్యుల అర్థంలేని కుతూహలానికి, తెలివి తక్కువ ప్రవర్తనకు విచారించి ఒరేయ్ బాబులూ! మీరందరూ వెర్రివెంగళప్పలేరా? ఇందులో ఏమాత్రం సందేహం లేదు అన్నారు. దాంతో శిష్యులు ఆనందంగా గెంతులేయసాగారు. వార్ని అలా చూస్తున్న పరమానందయ్యగారు తలపట్టుకు కూర్చున్నారు.



## వికటించిన వైద్యం

పరమానందయ్యగారు మంచి పండితుడే కాకుండా, గొప్ప ఆయుర్వేద వైద్యుడిగా, కూడా పేరు పొందాడు. అరవ దేశానికి (తమిళనాడు) చెందిన సిద్ధవైద్యంలో కూడా ఆయన నిష్ణాతుడు.

శిష్యులని కూడా వైద్య శాస్త్రంలో పండితులుగా చేయాలని ఆయన ఆశ. అందుకే వీలున్నప్పుడల్లా శిష్యులకి, ఆయుర్వేద వైద్యంలో మెళుకువలు నేర్పేవాడు.

ఒకసారి పరమానందయ్యగారు శిష్యులకి వైద్యశాస్త్ర పాఠాలు చెపుతున్నాడు. ఆ సమయంలో.... నాయనలారా వైద్యం శ్రీనారాయణుడి అంశలైన అశ్వనీదేవతల ప్రసాదం. అందువల్ల వైద్యుడు 'నారాయణుడితో సమానం' అని చెప్పారు.

వైద్యవృత్తి అన్ని వృత్తులకన్నా గొప్పది. శారీరిక బాధల్లో ఉన్నవారికి వైద్యుడు దైవంతో సమానం. రోగికున్న రోగాన్ని మొదట నిర్ధారించి సరిగ్గా చేయటమే వైద్యుడి ప్రధాన కర్తవ్యం అన్నారు.

గురువుగారి పాఠాలు విన్న శిష్యులు గంభీరంగా, అలాగే గురువుగారు, మేం కూడా రోగిని జాగ్రత్తగా పరిశీలించి, ఖచ్చితంగా రోగాన్ని నిర్ధారించి ఆ తర్వాతే ఔషధాలు ఇస్తాం అన్నాడు. మంచిది, అలాగే చెయ్యండి అన్నారు పరమానందయ్యగారు.

ఒకసారి పరమానందయ్యగారు కొవ్వూరు అనే గ్రామంలో ఒక రోగిని చూడటానికి వెళుతూ, చూసి నేర్చుకుంటారని శిష్యులని కూడా తీసుకుని వెళ్ళారు. గంగవరం అనే గ్రామం నుండి పడవ ఎక్కి కొవ్వూరు వెళ్ళారు పరమానందయ్యగారు, ఆయన శిష్యులు.

కొవ్వూరు గ్రామంలో గరటయ్య అనే ముసలి రైతుకి వైద్యం చేయటానికి కొవ్వూరు వచ్చారు పరమానందయ్యగారు, ఆయన శిష్యులు.

ఊరిమధ్యలో ఉన్న పెద్ద భవంతి గరటయ్యది. ఆ గరటయ్య పెద్ద పిసినారి. వడ్డీ వ్యాపారం చేసి కోట్లకి పడగలెత్తాడు.

అధిక వడ్డీలు గుంజి ఆ ప్రాంత ప్రజల్ని నిలువుదోపిడి చేసిన వ్యక్తి ఆ గరటయ్య.

అలాంటి గరటయ్య ఒక సంవత్సర కాలంగా ఏదో ఉదరసంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. శిష్యులతో సహా వచ్చిన పరమానందయ్య గారిని ఆనందంగా ఇంట్లోకి ఆహ్వానించి మర్యాదలు చేసాడు గరటయ్య. కుశల ప్రశ్నలు అయినాక గరటయ్య నాడి పట్టుకు చూసారు పరమానందయ్యగారు. ఆపై గరటయ్య శారీరక బాధ గురించి కొన్ని ప్రశ్నలు వేశారు.

గరటయ్య చెప్పిన దాని ప్రకారం, అతడికి కొన్ని నెలలుగా తీవ్రమైన మలబద్ధకం వున్నది. దాంతో ఆహారం తినటం తగ్గిపోయి, పుల్లలా తయారయ్యాడు గరటయ్య. గురువుగారు గరటయ్య భార్యను పిలిచి వంటాముదం, జిల్లేడు ఆకులు, మండుతున్న నిప్పుల కుంపటిని తెప్పించారు.

ఆ ఇంట్లో గరటయ్య, అతడి భార్య మినహా మరో మనిషి లేడు. పిసినారి గరటయ్యకి పిల్లలులేరు. ఎంగిలి చేత్తో కాకిని తోలడు కనుక చుట్టాలెవరూ, అతడింట్లో కాలు పెట్టరు.

సరే గరటయ్య భార్య, పరమానందయ్యగారు చెప్పిన వస్తువులన్నీ తెచ్చి, ఆయన ముందు పెట్టింది.

అప్పుడు పరమానందయ్యగారు పెద్ద శిష్యుడు శర్మను పిలిచి, ఒరే బాబూ! నాలుగు జిల్లేడు ఆకులకి కాస్త ఆముదం పూసి, ఆ కుంపటి సెగపైన వెచ్చపెట్టి, ఆ తర్వాత ఆకుల్ని గరటయ్య పొట్ట మీద పరువు అన్నారు. ఈలోగా గరటయ్యని నేలపై వెల్లికిలా, కాళ్ళు జాపి పడుకోమని చెప్పారు.

అలా నేలపై పడుకున్న గరటయ్య పొట్ట మీద వంటాముదం పూసి, నిప్పులపై వేడి చేసిన జిల్లేడు ఆకులు శిష్యుడిచే పరిపించారు. ఒక అరగంట గడిచింది. శిష్యులంతా గరటయ్య చుట్టూతా నించుని, అతని ప్రవర్తనను



గమనించసాగారు. అరగంట పూర్తి కాగానే, ఆరు నెలలుగా, రాయిలాగా ఉన్న అతని పొట్ట కదలసాగింది.

కడుపులో గడ,బిడ మొదలయింది. ఆ విషయాన్నే పరమానందయ్య గారికి చెప్పాడు గరటయ్య. వెంటనే గురువుగారు, గరటయ్యను లేచి నుంచుని, చెంబు తీసుకుని పెరటివైపు వెళ్ళమని చెప్పారు. శిష్యులు పెద్ద ఇత్తడి చెంబుతో నీళ్ళు తెచ్చి, గరటయ్య చేతికి ఇచ్చారు.

వెంటనే గరటయ్య, దొడ్లోకి వెళ్ళాడు. అప్పుడు గురువుగారు తన శిష్యులకి ఇలా చెప్పారు. చూసారా నాయనలారా! ఈ గరటయ్యకు విసర్జనకు ఆటంకం కలిగి, అనారోగ్యంతో ఉన్నాడు. శరీరంలో ఉన్న చెడు పదార్థం ప్రాణానికి చేటు తెస్తుంది. ఇప్పుడు ఆరోగ్యవంతుడు కాగలడు.

గురువుగారి రోగపరిశీలనా శక్తికి, ఔషధ నిర్ణయ జ్ఞానానికి మురిసిపోయిన, ఆయన శిష్యులు తాము కూడా గురువుగారి అంత వాళ్ళము కావాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. ఇంతలో దొడ్లోంచి గరటయ్య వచ్చాడు.

అతని ముఖంలో ఏదో తెలియని ఆనందం కనిపించింది గురువుగారికి, ఆయన శిష్యులకి.

గరటయ్యకి వైద్యం చేస్తుండగానే, ప్రక్క గ్రామం నుండి ఇంకో వ్యక్తికి వైద్యం చేయటానికి రమ్మని పరమానందయ్యగారికి పిలుపు వచ్చింది. దాంతో గురువుగారు, శిష్యుల్ని ఆ రోగి సంగతి చూడమని ప్రక్క వూరికి పంపి తాను గరటయ్యకి వైద్యం చేస్తూ ఉండిపోయారు.

ఇక పరమానందయ్యగారి శిష్యులు ప్రక్క గ్రామంలో ఉన్న రోగిని చూసి రోగ నిర్ధారణా కార్యక్రమం మొదలుపెట్టారు. అదెలాగంటే – ముందుగా పెద్ద శిష్యుడు శాస్త్రి రోగిని, నీ బాధ ఏమిటి అని అడిగాడు. ఆ రోగి, తనకు వారం రోజులుగా విరోచనాలు అవుతున్నాయని, కడుపు నొప్పిగా ఉన్నదనీ చెప్పాడు.

వెంటనే రెండవ శిష్యుడు శర్మ వంటాముదం తెచ్చి, ఆ రోగి పొట్టనిండుగా తాగించాడు. దాంతో ఆ రోగికి విరోచనాలు ఇంకా అధికం

అయి నీరసించి పోయాడు. బాగా నీరసంగా ఉన్నది అన్నాడు రోగి కళ్ళు తేలవేస్తూ.

దాంతో సుబుద్ధి అనే శిష్యుడు, రోగికి ఆ సమస్య తీరి ఒంట్లో ఓపిక రావాలంటే, జిల్లేడు ఆకుల్ని నిప్పులపై కాల్చి తినిపిస్తే బాగుంటుందని చెప్పాడు.

వెంటనే నిప్పులపై ఆకులని వెచ్చబెట్టి వాటిని తినమని రోగిని బలవంత పెట్టారు పరమానందయ్యగారి శిష్యులు.

ఇక గత్యంతరం లేక రెండు జిల్లేడు ఆకులు నమిలితిన్నాడు ఆ రోగి. అంతే విషపూరితం అయిన జిల్లేడు ఆకులు, అసలే కృశించి ఉన్న అతనికి ప్రాణాంతకంగా మారాయి. దాంతో ఆ రోగి కాస్తా గుటుక్కు మన్నాడు.

దాంతో ఆ రోగి తాలూకు బంధువులు పరమానందయ్యగారి శిష్యులకు బడిత పూజ చేసి ఊరి చివరిదాకా తరిమారు. తాము ఎంతో శ్రద్ధగా, మేథస్సు ఉపయోగించి చేసిన, ఆ వైద్యం ఎందుకు బెడిసి కొట్టిందో అర్థంకాక తలబద్దలు కొట్టుకొని మరీ ఆలోచించారు. అయినా ఆ శిష్యులకు ఏమాత్రం అర్థం కాలేదు.

# ప్రయాణంలో పదనిసలు

ఒకసారి పరమానందయ్యగారు రాజమహేంద్రవరంలో జరగబోతున్న ఒక దూరపు బంధువుల ఇంట్లో జరిగే పెళ్ళికి వెళ్లాల్సి వచ్చింది. ఆ కాలంలో రైళ్ళు, కార్లు, బస్సులు లేవు కనుక ఎడ్లబండిలోనే ఎక్కడికైనా వెళ్ళేవారు. సరే బంధువుల ఇంటికి పెళ్ళికి వెళ్తున్నాం కదా, మన శిష్యుల్ని కూడా తీసుకెళ్దామని పరమానందయ్యగారు భార్యను అడిగారు.

ఏ కళన ఉందో, ఏమో కానీ, ఆమె సరే అన్నది. దాంతో పరమా నందయ్య గారు శిష్యుల్ని పిలిచి, ఒరేయ్! మనం రేపు ఉదయం రాజమహేంద్రవరం పెళ్ళికి వెళ్తున్నాం. అందరూ సిద్ధంగా ఉండండి అన్నారు. అంతే శిష్యులు ఆనందంతో గంతులు వేశారు.



కారణం వాళ్లు అప్పటిదాకా, వాళ్ళు ఉంటున్న ముక్తేశ్వరం గ్రామాన్ని దాటి ఎన్నడూ, ఎక్కడికీ వెళ్ళిన వాళ్ళు కాదు మరి. గురువుగారు శిష్యుడి చేత పంచాంగం తెప్పించి ప్రయాణానికి మంచి ముహూర్తం చూడసాగారు. దాంతో ఆయన శిష్యులందరూ హుషారుగా గురువుగారి చుట్టూ చేరి, గురువు గారిని, పంచాంగాన్ని మార్చి, మార్చి చూడసాగారు.

సరే చివరికి నక్షత్రాలు, వారాలు, తిథులు లెక్కగట్టి రేపు ఉదయం సూర్యోదయానికి ముందు బయలుదేరితే బాగుంటుందని తేల్చారు గురువుగారు. శిష్యులంతా ఆనందంతో గంతులేసారు. గురువుగారి భార్య ప్రయాణంలో కావాల్సిన వస్తువులు సర్దింది.

ఇక అన్నపానాదుల గురించి ఆలోచించి ఓ పెద్ద గిన్నెనిండా దబ్బకాయ పులిహోర, ఇంకో బిందె నిండా చక్కటి మినపగారెలు, వాటిల్లో నంజుకోవటానికి ఆవకాయతో సహా సర్దింది. సరే కోడికూసే సరికి గురువుగారితో సహా శిష్యులందరూ కాలకృత్యాలు తీర్చుకొని, స్నానాలు చేసి, సంధ్యా వందనాలు చేసి, మంచి బట్టలు కట్టుకొని ప్రయాణానికి సిద్ధం అయ్యారు.

ఇంతలో పరమానందయ్యగారి పాలేరు ఎండ్లబండి సిద్ధం చేసి ఇంటిముందు నిలబెట్టాడు. గురుపత్ని, గురువుగారు సౌకర్యంగా బండి ఎక్కటం కోసం, ఒక ముక్కాలిపీట తెచ్చి బండి వెనకాలవైపు నిలబెట్టారు. వాళ్ళ హడావుడి, ఆదుర్దా చూసి, చిరునవ్వులు చిందిస్తూ గురువుగారు, ఆయన భార్య, కూతురు, ఆ ముక్కాలి పీటపై కాలువేసి, జాగ్రత్తగా బండి ఎక్కారు.

ఆ బండిలో గురువుగారి కుటుంబం ఎక్కగా, ఇంకా కాస్త జాగా మాత్రమే మిగిలింది. ఆ కాస్త చోటు ప్రయాణంలో భుజించటానికి సిద్ధం చేసిన ఆహార పదార్థాల పాత్రలు, మంచినీళ్ళ బిందె పెట్టటానికి సరిపోయింది.

దాంతో పరమానందయ్యగారు శిష్యుల్ని ఇంకో బండి ఎక్కి రమ్మన్నారు. అప్పుడు శిష్యులు, గురువుగారూ! రాజమహేంద్రవరం దాకా నడిచే వస్తాం అలా అయితే మార్గం మధ్యలో వింతలు, విశేషాలు చూస్తూ రావచ్చు కదా అన్నారు సంయుక్తంగా.

సరే, నడక మీ వంటి యువకులకు మంచిదే కానీండి అని, బండిని పోనిమ్మని బండివాడికి ఆజ్ఞ ఇచ్చారు పరమానందయ్యగారు. సరే బండి బయలుదేరింది. పరమానందయ్యగారి శిష్యులు సరదాగా ఛలోక్తులు విసురుకుంటూ బండి వెనకాలే నడవసాగారు.

బండి మెల్లిగా నడుస్తూ మధ్యాహ్నానికి మండపేట చేరింది. ఒక దేవాలయ మంటపం దగ్గర బండిని ఆపించి, పరమానందయ్యగారి కుటుంబం, శిష్యుల బృందం, తమతో తెచ్చుకున్న ఆహార పదార్థాలను తృప్తిగా భుజించారు.

ఆ తర్వాత మళ్ళీ వాళ్ళ ప్రయాణం మొదలయింది. బండి సామర్లకోట కాలువకట్ట మీదుగా సాగిపోతున్నది. అప్పటికి రాత్రి అయింది. రాత్రి వేళ బండిలోంచి ఏదైనా జారిక్రింద పడే అవకాశమున్న కారణంగా, పరమానందయ్యగారు తన శిష్యుల్ని హెచ్చరించారు.

ఒరేయ్ అబ్బాయిలూ! బండిలోంచి ఏమైనా వస్తువులు క్రింద పడతాయేమో జాగ్రత్తగా చూస్తూ ఉండండి అన్నారు. సరే అన్నారు శిష్యులు. ఇంతలో బండి మేడపాడు గ్రామం మీదుగా వెళుతుండగా గురువుగారి రాగి చెంబు ఠంగ్‌మని నేలపై పడింది. అది చూసినా శిష్యుడు గురువుగారికి చెంబు క్రింద పడ్డ విషయం చెప్పలేదు.

కారణం గురువుగారు ఏదైనా వస్తువు క్రిందపడితే చూడమన్నారు కానీ, తీయమని, చెప్పమని చెప్పలేదు కదా..... కనుక చెంబు పడ్డ విషయం చెప్పకుండా బండి వెనుక నడక సాగిస్తున్నారు. అర్ధరాత్రి ప్రాంతానికి మంచి నిద్రలో ఉన్న పరమానందయ్యగారికి మెలుకువ వచ్చి, కాసిని నీళ్ళు తాగుదామని రాగి చెంబు కోసం వెతికారు.

కానీ అది దొరకలేదు. దాంతో బండి వెనుకగా నడిచి వస్తున్న శిష్యుల్ని పిలిచి, రేయ్ అబ్బాయిలూ! నా చెంబు ఏమైనా క్రింద పడింది చూసారా అని అడిగారు. అప్పుడు శాస్త్రి ఇలా అన్నాడు.

కొబ్బరిబొండాం అంతలా వుండి, గుండ్రని అంచున్న చెంబేనా అండీ. ఔను ఆ చెంబేరా బాబూ... దొరికిందా అన్నారు పరమానందయ్య గారు. శాస్త్రి సమాధానం చెప్పే లోగా ఇంకో శిష్యుడు అందుకుని, గురువుగారూ! క్రింద భాగంలో సొట్ట ఉండి, ఎర్రగా తళ, తళలాడుతున్న రాగి చెంబేనా అండీ అన్నాడు.



గురువుగారు, ఔను ఆ చెంబేరా ... ... దొరికిందా ఇలా ఇవ్వు అన్నారు. అప్పుడు శాస్త్రి ఎలా దొరుకుతుందండి... ఆ చెంబు మేడపాడు కాలవగట్టు పైన పడితేను అన్నాడు.

దాంతో ఒళ్ళు మండిన పరమానందయ్యగారు, ఓరీ మూర్ఖులారా క్రింద బడ్డ చెంబు తీయాలని తెలిసిచావదా మీకు అన్నారు. అప్పుడు శాస్త్రి, అదేంటండీ, మీరేగా ఏదైనా క్రిందపడితే చూస్తూ ఉండండి అన్నారే కానీ, క్రింద పడింది తీసి ఇవ్వమని మీరు చెప్పలేదుగా అన్నాడు.

దాంతో గురువుగారికి అర్థం అయింది తన శిష్యులు, తాను ఏది చెబితే అది మాత్రమే చేసే అమాయకులు అని. సరే, ఇకపై క్రింద ఏదిపడ్డా, అది తీసి బండిలో వెయ్యండి అన్నారు గురువుగారు. సరే, సరే, అన్నారు శిష్యులు సంయుక్తంగా.

బండి కడియం గ్రామం పొలిమేరలు చేరుతుండగా, బండికి కట్టిన ఎడ్లు పేడ వేయటం మొదలెట్టాయి. అది గమనించిన శిష్యులు నేలపై పడ్డ పేడను ఉండలుగా చేసి, బండిలోకి విసరసాగారు. అప్పటికి మంచి నిద్రలో ఉన్న పరమానందయ్య గారి ముఖానికి, ఆ శిష్యులు విసిరేసిన పేడ ముద్దలు టప, టప మని తగిలాయి.

ఆయన గభాల్న నిద్దరనించి లేచి చూసారు. ఇంకా మీద పడుతున్న పేడ ముద్దల్ని చూసి, విషయం అర్థమై, ఒరేయ్ శర్మా, శాస్త్రీ నా మీద పేడ విసురుతున్నారేంటిరా అని అరిచారు.

అప్పుడు శాస్త్రి, అయ్యా గురుదేవా! మీరేగా ఇందాక, క్రిందపడ్డవి అన్నీ ఎత్తి బండిలోకి వేయమన్నారు. అందుకే క్రిందపడ్డ పేడని బండిలోకి విసురుతున్నాం అన్నాడు.

అప్పుడు పరమానందయ్యగారు, తన మూర్ఖ శిష్యుల చర్యలకి ముందు కోపం తెచ్చుకున్నా ఆ తరువాత పగలబడి నవ్వారు. ఇంతలో రాజమహేంద్రవరం పొలిమేరలలోకి చేరింది బండి.

# గురువుగారికి తలకొరివి

ఒకసారి పరమానందయ్యగారి దూరపు చుట్టం ఒకాయన మరణించాడు. ఆయనకి ఒక్కగానొక్క కొడుకు ఉండేవాడు. ఆ చుట్టం ఈ మధ్యే మరణించినపుడు, ఆ చుట్టానికి తలకొరివి పెట్టాల్సిన కొడుకు దూరదేశంలో అనారోగ్యం పాలయి మంచం పట్టి ఉండటం వల్ల తండ్రికి తలకొరివి పెట్టటానికి రాలేకపోయాడు.

చివరికి ఎవరో స్వకులంలోని మధ్యవయస్కుడి చేత, ఆ చుట్టం అంత్యక్రియలు ముగించాల్సి వచ్చింది. ఆ అంత్యక్రియలకి పరమానందయ్య గారు కూడా హాజరు అయ్యారు. తలకొరివి పెట్టే వారసుడు లేకుంటే ఎంత కష్టం అనుకున్నారు.

పైగా పరమానందయ్యగారికి ఉన్నదల్లా ఒకే ఒక ఆడపిల్ల, మగపిల్లలు లేరు. ఇక తనకి అంత్యక్రియలు, అపరకర్మలు ఎవరు చేస్తారు అన్న భీతి ఆయన్ని కలిచి వేసింది. ఆ చుట్టం అంత్యక్రియలకి వెళ్ళి వచ్చిన తర్వాత, పరమానందయ్య గారు దిగులుగా ఉండటం చూసిన ఆయన శిష్యులు, ఒకరోజు మధ్యాహ్నం భోజనానంతరం ఆయన్ని సమీపించి, గురువుగారూ! మీరు ఈ మధ్య దేని గురించో తెగ బాధపడుతున్నారని అనిపిస్తున్నది. దయచేసి మీ బాధ ఏమిటో చెప్పండి, మేం తీరుస్తాం అన్నారు ఆ అమాయక శిష్యరత్నాలు.

శిష్యుల మాట విన్న పరమానందయ్యగారు, తాను తలకొరివి పెట్టే వారసుడు లేక బాధపడుతున్నానని వాళ్ళకి చెప్పలేక, అబ్బే ఏం లేదు, నాకేమీ దిగులులేదు అని తప్పించుకోవాలని చూసారు.

అయినా ఆయన శిష్యులు మొండిపట్టు పట్టారు, మీ దిగులుకి కారణం చెప్పనిదే, సాయంకాలం చేయాల్సిన అల్పాహారం చేయము అన్నారు.

అసలు విషయం చెప్పకపోతే శిష్యులు తన మాట వినరని గ్రహించిన పరమానందయ్యగారు, పెద్ద శిష్యుడు శాస్త్రిని పిలిచి ఇలా అడిగారు. "ఒరేయ్ శాస్త్రి, మొన్న మా చుట్టం ఒకాయన పోతే తలకొరివి పెట్టే కొడుకు లేక ఎంత ఇబ్బంది అయిందో చూశావు కదా, మరి నాకు ఆడపిల్ల ఉన్నది. మగబిడ్డ లేడు, మరి నాకు తలకొరివి ఎవరు పెడతారు, అదేరా నా దిగులంతా!"



గురువుగారి దిగులు ఏమిటో శాస్త్రికి, ఇతర శిష్యులకి అర్థం అయ్యింది. అప్పుడు శిష్యులలో రెండవవాడు శర్మ గురువు గారి దగ్గరగా వెళ్ళి "ఎంత మాట అన్నారు గురుదేవా, మిమ్మల్ని కేవలం గురువుగానే కాకుండా మా తండ్రిలాగా కూడా చూసుకుంటున్నాం కదా! అలాంటిది మీకు తలకొరివి పెట్టటానికి వారసుడు లేరని మీరు ఎలా బాధపడుతున్నారు. మమ్మల్ని మీ బిడ్డలుగా భావించటం లేదా" అన్నాడు బాధగా.

శిష్యుల మాటలు విన్న పరమానందయ్యగారు గతుక్కుమన్నారు. అయ్యో ఎంత మాట... మీరందరూ నా బిడ్డలే కదా అన్నాడు ఆపేక్షగా శర్మ తల నిమురుతూ. గురువుగారి మాటలకి చాలా ఆనందించి, చప్పట్లు కొట్టారు. ఇక నుండి మనం గురువుగారిని, గురువుగారిలా చూడరాదు. పూర్తిగా తండ్రిగారి లాగానే చూద్దాం అని తీర్మానించారు ఆ పదముగ్గురు శిష్యులు.

శిష్యుల అభిమానం కళ్ళారా చూసిన పరమానందయ్య గారికి చాలా ఆనందం కల్గి, కళ్ళ వెంట ఆనంద భాష్పాలు జాలువారాయి. ఇక ఆ రోజుకి వారసుడి గురించిన చర్చ ముగిసింది.

ఒకసారి గురువుగారి ధర్మపత్ని ఏదో సందర్భంగా కూతుర్ని తీసుకొని పుట్టింటికి వెళ్ళింది. వెళ్ళేటప్పుడు శిష్యుల్ని పిలిచి ఒరేయ్ తెలివితక్కువ సన్నాసుల్లారా! మీరు చాలా బుద్ధిగా ఉండాలి. నేను రేపు మధ్నాహ్నానికల్లా తిరిగి వస్తాను. ఈ లోగా మీరు ఎలాంటి వెర్రి చేష్టలు చెయ్యకుండా ఉండాలి.

మీ గురువుగారికి పూజకి కావాల్సిన పూలు అందించండి, ఆ తర్వాత ఆయనకి సకాలంలో భోజనం పెట్టండి.

ఆయనకి అసలే ఈ మధ్య ఆరోగ్యం సరిగా ఉండటం లేదు జాగ్రత్తగా చూసుకోండి అని అన్నాది.

గురువుగారి ధర్మపత్ని, కూతురు ఎద్దుబండి మీద ఊరు వెళ్ళిపోయారు. ఇంతలో గురువుగారు, 'సుబుద్ధి అనే శిష్యుడ్ని పిలిచి

పంచాంగం తెమ్మన్నారు. శిష్యుడు గురువుగారు అడిగినది తెచ్చి ఇచ్చాడు. అప్పుడు గురువుగారు పంచాంగం తెరిచి, ఏదో భాగం చదివి, వ్రేళ్ళు మడిచి ఏదో లెక్కించసాగారు.

సుబుద్ధి గురువుగారు ఏం చేస్తున్నారా అని శ్రద్ధగా గురువుగారినే గమనించసాగాడు.

గురువుగారు మళ్ళీ పంచాంగం తిరగేసి, ఒకసారి ఏదో గొణుక్కుని, పంచాంగం మడిచి ప్రక్కన పెట్టారు.

ఇదంతా చూస్తున్న సుబుద్ధి గురువర్యా! తమరు ఇందాకటి నుండి పంచాంగాన్ని తెగ తిరగవేసారు. ఏం చేస్తున్నారు. ఎవరికైనా పెళ్ళి ముహూర్తం చూస్తున్నారా ఏమిటి అన్నాడు ఆసక్తిగా.

అప్పుడు పరమానందయ్యగారు, పెళ్ళి ముహూర్తం కాదురా సన్నాసీ, రేపు ఉదయం ఒక అరుదైన ముహూర్తం ఉన్నది, ఆ ముహూర్తంలో మరణించిన వారికి కైలాసప్రాప్తి కల్గుతుంది. ఇక పునర్జన్మ ఉండదు అన్నారు.

ఆహా! అలాగా, రేపు ఎంత సుదినం అని మనసులో అనుకున్న ఆ సుబుద్ధి, మిగిలిన శిష్యులకి ఈ మాట వివరించాడు. సుబుద్ధి మాటలు విన్న, పెద్ద శిష్యుడు శర్మకి ఒక మెరుపు లాంటి ఆలోచన వచ్చి, మిగతా శిష్యులతో ఇలా అన్నాడు.

ఒరేయ్ చవటల్లారా! నాకో బ్రహ్మాండమైన ఆలోచన వచ్చిందర్రా, మన గురువుగారికి మనం ఏ విధంగా అపరకర్మలు చేస్తామో, ముందుగానే జనానికి నిరూపించే మహత్తరమైన ఆలోచన అది. శిష్యులంతా ఆసక్తిగా చూసారు పెద్ద శిష్యుడివైపు.

అప్పుడు రెండవ శిష్యుడు శాస్త్రి, ఒరేయ్ శర్మా... గురువుగారి అపరకర్మ, ఆయన స్వర్గస్థులు అయినాక కదా చేయాల్సింది. మరి ఆయన నిక్షేపంగా బ్రతికి ఉండగా ఎలా చేస్తాం అన్నాడు.

అప్పుడు శర్మ, గురువు గారికి మనం, ఆయన మరణించినాక కర్మ కాండ బాగా జరుపుతామని తెలియాలంటే, మనం ఇప్పుడే ఆయనకి దహన సంస్కారాలు చెయ్యాలి. అప్పుడే ఆయనకి మన ప్రయోజకత్వం తెలిసేది అన్నాడు. సరే అంటే సరే అనుకున్నారు ఆ శిష్య శుంఠలు.



ఆ రోజు రాత్రి అయింది. మర్నాడు ఉదయం సూర్యోదయం అయినా పరమానందయ్యగారు నిద్ర లేవలేదు. ఆ రోజు ఆయనకి కాస్త అనారోగ్యంగా ఉండి, నిద్రలేవకుండా అలాగే పడుకున్నారు.

ఇది గమనించిన ఆయన శిష్యుడు సుబుద్ధి గబ, గబా మిగిలిన శిష్యుల దగ్గరికి వెళ్ళి, ఒరేయ్ గురువుగారికి జ్వరం వచ్చి నిద్రలేవకుండా పడుకున్నారు. ఇదే మంచి సమయం. ఆయనకి దహన సంస్కారాలు , తద్దినాలు జరిపించి, మన శక్తి ఆయనకి నిరూపిద్దాం రండి అన్నాడు ఆత్రంగా.

దాంతో శిష్యులంతా, చకచకా పాడె తయారుచేసారు. కుండలో పిడకలు, నిప్పు వేసి ఉంచారు. ఆపై ఇద్దరు శిష్యులు పరమానందయ్యగారిని మోసుకుని తెచ్చి పాడెపై పండబెట్టారు.

జ్వరంగా ఉన్న పరమానందయ్య గారికి శిష్యులు చేస్తున్న ఘనకార్యం అర్థం అయ్యేసరికి, ఆయన్ని పాడెపై కదలకుండా తాళ్ళతో గట్టిగా బిగించి కట్టేసారు. దాంతో పరమానందయ్య గారు, ఒరేయ్ అప్రాచ్యుల్లారా! ఏమిటిరా ఇదంతా, నన్ను బ్రతికుండగానే పాడెక్కించారు. కొంపదీసి స్మశానానికి తీసుకెళ్ళి దహన సంస్కారాలు కూడా చేస్తారా ఏమిటి అన్నారు ఆందోళనగా.

అప్పుడు పెద్ద శిష్యుడు శర్మ, గురువుగారి దగ్గరగా వచ్చి, అయ్యా గురవుగారూ! మీరు ఇప్పుడు చచ్చిపోయారు. చచ్చిన వాళ్ళు ఎక్కడైనా మాట్లాడతారా ఏంటి, మీరు నోర్మూసుకొని, ఆ పాడె మీద పడుకొని ఉండండి, మీకు తలకొరివి మహాగొప్పగా పెడతాం సరేనా అన్నాడు.

దాంతో పరమానందయ్యగారికి పైప్రాణాలు పైనే పోయాయి. ఓరి దుర్మార్గుల్లారా! నన్ను బ్రతికుండగానే పాడెక్కించారు, ఇప్పుడు తలకొరివి పెడతారా, మీ అఘాయిత్యం మండా అని అరవసాగారు పరమానందయ్య గారు.

గురువుగారు చచ్చినట్టు ఉండకుండా, మాట్లాడటం చూసిన ఒక శిష్యుడు గురువుగారి నోట్లో పచ్చి అరిటికాయ గుచ్చాడు. దాంతో పరమానందయ్యగారి నోటికి తాళం పడింది.

ఆపై పాడెని నల్గురు శిష్యులు భుజానకెత్తుకున్నారు. పెద్ద శిష్యుడు శర్మ, నిప్పున్న కుండ పట్టుకుని, శవాన్ని ఉంచిన పాడె ముందుగా నడవసాగాడు. ఇక దృశ్యం రక్తి కట్టాలంటే బాగా రోదించాలని తట్టిన శిష్యులు భోరుమని ఏడుస్తూ ఒక ఊరేగింపులా గోదావరి నదీ తీరంలో ఉన్న స్మశాన ప్రాంతానికి తీసుకెళ్ళారు.

అప్పటికే, అక్కడ చితి ఏర్పాట్లు చేసి, గురువుగారికి అంతిమ వీడ్కోలుకి అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉన్నాడు చిన్న శిష్యుడు శాస్త్రి. పరమానందయ్యగారిని శ్రద్ధగా తీసుకెళ్ళి పాడెతో సహా చితిపై ఉంచారు.

ఈలోగా పుట్టింటికెళ్ళిన గురువుగారి భార్య తిరిగి వచ్చి చూస్తే ఇంట్లో ఎవరూ లేరు. అక్కడంతా వాతావరణం ఏదోగా ఉన్నది. ఆమెకి ఏమీ అర్థం కాలేదు.

ఇంతలో ఎవరో చెప్పారు పదమానందయ్యగారు ఓ గంట క్రితం పరమపదించారని, శిష్యులు ఆయన అంత్యక్రియలు చేయటానికి, గోదావరీ తీరానికి పాడెపై తీసుకెళ్ళారనీ.

భర్త అంత అకస్మాత్తుగా మరణించారన్న వార్త విన్న ఆ ధర్మపత్ని, పెద్దగా ఏడుస్తూ కూతురితో సహా స్మశానానికి పరుగెత్తింది. ఈలోగా అక్కడ శర్మ గురువుగారి చితి చుట్టూ ప్రదక్షిణాలు చేసి, సరిగ్గా గురుపత్ని అక్కడికి చేరుకున్నప్పుడే చితికి నిప్పు అంటించాడు.

ఆ దృశ్యం చూసిన గురుపత్ని ఆకాశం పగిలేలా ఏడ్చింది. తలవైపు మంట తాలూకు సెగ తగలగానే పరమానందయ్యగారు అటు, ఇటు గింజుకున్నారు. దాంతో ఆయన నోట్లో ఉన్న పచ్చి అరిటికాయ అవతల పడింది. అప్పుడు ఆయన పెద్దగా అరిచాడు నేను బ్రతికే ఉన్నాను, నన్ను ఎవరైనా కాపాడండీ అని.

అంతే ధర్మపత్ని వేగంగా చితి దగ్గరికి వెళ్ళి, పరమానందయ్యగారున్న పాడెని, చితి మీద నుండి అవతలికి తోసేసింది. ఇంకొద్ది నిముషాలు ఆయన చితిపైనే ఉండి ఉంటే ఆయనకి కూడా నిప్పు అంటుకునేది. పాపం ధర్మపత్ని మంగళసూత్రం గట్టిది కాబోలు పరమానందయ్యగారు బ్రతికి బట్ట కట్టారు.



ఈ విషయం తెలిసి అందరూ నానా మాటలు అని, చావ కొట్టాలని చూడటంతో, ఇక లాభం లేదని పరమానందయ్యగారి శిష్యులు అసలు విషయం బయట పెట్టారు.

పెద్దశిష్యుడు శర్మ ఇలా అన్నాడు... గురుదేవా మీరు మరణించిన తర్వాత మీ అంత్యక్రియలు ఎలా చేస్తామో మీకు స్వయంగా చూపించాలని ఇలా చేసాం.

మాకు మీపై ఎలాంటి కోపం లేదు, క్షమించండి.... మిగిలిన శిష్యులు కూడా ఏడుస్తూ, పరమానందయ్యగారి కాళ్ళ మీదపడి జరిగిన పొరపాటుకి క్షమించమని వల,వలా ఏడ్చారు.

దాంతో పరమానందయ్యగారికి జాలివేసి ఇలా అన్నారు. "పిచ్చి సన్నాసుల్లారా! ఏడవకండి... ఇదంతా నా గతజన్మ కర్మ ఫలం. నా అంత్యక్రియలు నేనే చూసుకునే ఖర్మ నాకు పట్టింది. ఇందులో మీ తప్పు ఏమీ లేదు".

## పరమానందయ్య శిష్యుల శాపవిమోచనం

భల్లూక వర్మ అనే దారి దోపిడీ దొంగల నాయకుడు చాలా దుష్టుడు. వాడు అడవిలో దారి కాచి, అటుగా వెళ్ళే ప్రయాణీకుల్ని దోచుకుని ఆపై క్రూరంగా చంపేసేవాడు. వాడికి మహాక్రూరుడు అని పేరు.

చంద్రసేనుడి రాజ్యానికి సరిహద్దులలో ఉన్న ఆ భల్లూక వర్మ ఆగడాలు చంద్రసేనుడికి తెలిసాయి. ప్రజల్ని అలా హింసిస్తున్న ఆ దోపిడీ దొంగకి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్న చంద్రసేనుడు అతని సైనికులు బాటసారులుగా మారువేషాలు ధరించి, అడవిలో ప్రయాణించ సాగారు.

వాళ్ళు సరిగ్గా అడవి మధ్యలోకి వచ్చేసరికి, భల్లూకవర్మ వాళ్ళని అడ్డగించి, వాళ్ళ దగ్గరున్నవి లాక్కోవాలని చూసాడు. దాంతో చంద్రసేనుడు తన మారువేషం తొలగించి, భల్లూకవర్మతో, రేయ్ భల్లూకవర్మా! ఇంతకాలం జనాల్ని భూతంలా పీడిస్తున్నా నీ కథ నేటితో ముగిసింది. కాచుకో అన్నాడు.

మహారాజుని గుర్తించిన భల్లూకవర్మ ఏ మాత్రం భయపడక, ఓరీ రాజా! నీవు నగరంలో రాజువి, ఈ అడవికి నేనే రాజుని, ఇక నీ పని సరి

అని, పెద్దగా ఈలవేసాడు... అంతే ఒక నలభైమంది అనుచరులు ఆయుధాలతో వచ్చి పడ్డారు.

అప్పుడు చంద్రసేనుడు, బాటసారుల వేషాలలో ఉన్న రాజ సైనికులు ఆ దొంగలపై యుద్ధానికి దిగారు. చంద్రసేనుడు, భల్లూకవర్మ కత్తులు కలుపుకున్నారు.

ఖంగ్, ఖంగ్ మన్న వారి ఖడ్గాల శబ్దం ఆ అడవిలో ప్రతిధ్వనించింది. భల్లూకవర్మ శారీరకంగా మహాబలవంతుడు. ఖడ్గ యుద్ధంలో కూడా చాలా నిపుణుడు. రెండు సింహాలు యుద్ధం చేస్తున్నట్టుగా రెండు కొండలు ఢీ కొంటున్నట్టుగా ఉన్నది చంద్రసేనుడికి, భల్లూకవర్మకి మధ్య జరుగుతున్న ఖడ్గయుద్ధం.

కానీ చంద్రసేనుడూ మహావీరుడు కావటంతో, భల్లూకవర్మ చేతిలోని ఖడ్గాన్ని ఎగరగొట్టి, అదే కత్తితో భల్లూక వర్మ భుజంపై గాయం చేసాడు. ఇంతలో రాజసైనికులు వచ్చి భల్లూకవర్మని, అతని అనుచరుల్ని బంధించి వేసారు.

అప్పుడు చంద్రసేనుడు, ఈ గజదొంగని, వాడితోడు దొంగల్ని నా దర్బారుకి తీసుకురండి... వాడి నేరాలు విచారించి తగిన శిక్ష వేస్తాను అన్నాడు.

భల్లూకవర్మ ఏమీ మాట్లాడకుండా, క్రోధంగా చంద్రసేనుడి కేసి చూస్తూ నించున్నాడు. చంద్రసేనుడు సైనికులు తెచ్చిన గుర్రం ఎక్కి తన రాజధానికి వెళ్ళిపోయాడు.

భల్లూవర్మను అతడి అనుచరుల్ని కట్టేసి, రథాలపై వేసుకొని, రాజధానికి తీసుకెళ్ళారు రాజసైనికులు.

భల్లూకవర్మ కారాగారంలో ఉన్నాడు. అతడి అనుచరులు కూడా అదే కారాగారంలో వేర్వేరు, గదులలో ఉంచబడ్డారు. రాత్రి దాటింది. రాజ్యంలో ప్రజలందరూ నిద్రలో ఉన్నారు. భల్లూకవర్మ నిద్రపోకుండా ఆ జైలు గదిలో అటు, ఇటూ ఆగ్రహంగా పచార్లు చేస్తున్నాడు.

ఎలాగైనా ఈ జైలు నుండి తప్పించుకొని, ఆ చంద్రసేనుడిని హతమార్చాలని అనుకున్నాడు. అందుకోసం ఏ మార్గం ఉన్నదా అని



ఆలోచించసాగాడు. హఠాత్తుగా అతడికి ఒక ఆలోచన తట్టింది. అంతే, దుస్తులలో నుండి ఒక వనమూలికను తీసి, తను ఉన్న జైలు గది తలుపుకున్న ఇనుప కడ్డీలపై ఉంచాడు.

ఆశ్చర్యం, ఆ ఇనుప కడ్డీలు మైనపుముద్దలలా కరిగిపోయాయి. అంతే, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, భల్లూకవర్మ ఆ గదిలోంచి తప్పించుకుని రాజ భవనంలోకి ప్రవేశించి, చంద్రసేనుడు నిద్రించే గది ఎక్కడ ఉన్నదా అని అన్వేషించసాగాడు.

వరుసగా ఉన్న ఆ గదుల్ని పరిశీలిస్తూ, ఒక గదిలో హంసతూలికా తల్పంపై నిద్రస్తున్న చంద్రలేఖను చూసి ఆశ్చర్యపడ్డాడు. మెల్లగా నడుస్తూ, ఆమె శయ్య దగ్గరికి వెళ్ళి ఆమె ముఖాన్ని, అందాల్ని పరిశీలనగా చూడసాగాడు.

ఆమె గంధర్వ స్త్రీ అని భల్లూకవర్మకి తెలీదు. కానీ అద్భుత సుందరి అని మాత్రం తెలుసుకున్నాడు. ఆమెను శయ్యపైనుండి ఎత్తి భుజాన వేసుకొని ఆ గది నుండి బయటికి పరిగెత్తాడు. ప్రస్తుతం భల్లూకవర్మ, తన శత్రువు చంద్రసేనుడి గురించి తాత్కాలికంగా మర్చిపోయాడు.

అతని ముందున్న ఏకైక లక్ష్యం, ఎలాగైనా, ఈ సుందరిని రాజభవనాన్ని దాటించి, అడవిలోని తన నివాసానికి తీసుకెళ్ళి వివాహం ఆడాలి. అందుకే అతడు చంద్రసేనుడిని వెతకకుండా నిశ్శబ్దంగా రాజ భవనం దాటాలని ప్రయత్నిస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే నిద్రలోంచి మేల్కొన్న చంద్రలేఖ తను ఎవరి చేతనో అపహరించబడుతున్నానని గ్రహించి, భయంతో కేకలు వేసింది. ఆమె కేకలు గాఢనిద్రలో ఉన్న చంద్రసేనుడి చెవులకి వినిపించి, హఠాత్తుగా నిద్రలేచి తల్పంపై కూర్చున్నాడు.

మెలుకువ వచ్చిన చంద్రసేనుడికి మళ్ళీ చంద్రలేఖ స్వరం వినిపించి, చివాల్న శయ్య మీద నుండి లేచి, గోడకి ఉన్న ఖడ్గాన్ని తీసుకుని బయటికి పరిగెత్తాడు.

దూరంగా రాజభవనం ద్వారం కేసి, చంద్రలేఖతో సహా పరుగెడుతున్న భల్లూకవర్మ కనిపించాడు.

చంద్రసేనుడు వేగంగా అటువైపు పరిగెత్తాడు. భల్లూకవర్మ పట్టు నుండి తప్పించుకోవాలని చంద్రలేఖ పెనుగులాడుతున్నది.

ఈ దృశ్యం చూసి, చంద్రసేనుడు ఆగ్రహంతో రగిలిపోయాడు. చేతిలో ఉన్న ఖడ్గాన్ని గాలిలో గిర, గిరా తిప్పి భల్లూకవర్మ కేసి విసిరాడు. ఆ ఖడ్గం మహావేగంగా, గాలిలో దూసకుపోయి, భల్లూక వర్మ వెన్నులో బలంగా దిగింది.

ఆ కత్తి పోటుకి భల్లూకవర్మ చంద్రలేఖను దూరంగా విసిరి తాను నేలపై కూలిపోయాడు. చంద్రసేనుడు భల్లూకవర్మకి ఏమయిందో అని గమనించకుండా క్రిందపడ్డ చంద్రలేఖ దగ్గరికి వెళ్ళి చూసాడు.

భల్లూకవర్మ ఆమెను వేగంగా ప్రక్కకి విసరటం వల్ల ఆమె బలంగా నేలపై పడి స్పృహ కోల్పోయింది. చంద్రసేనుడు, ఆమెను మెల్లిగా లేపి నుంచోపెట్టి మెల్లగా నడిపిస్తూ, ఆమె మందిరానికి తీసుకువెళ్ళాడు.

ఈలోగా రాజసైనికులు వచ్చి భల్లూకవర్మని బంధించాలని భావించారు. వాళ్ళకి ఆ శ్రమ లేకుండా భల్లూకవర్మ చచ్చిపడి ఉన్నాడు. చంద్రసేనుడి ఖడ్గం వాడి గుండెని చీల్చేసింది.

ఎందరి ప్రాణాలనో దారుణంగా బలి తీసుకున్న భల్లూకవర్మ నికృష్టమైన చావు చచ్చాడు. సైనికులు వాడి శవాన్ని తీసుకువెళ్ళి దహనం చేసి వచ్చారు.

అయితే తెలివి తక్కువ తనం వల్ల గురువుగారికి తలకొరివి పెట్టబోయి అందరి చేత ఛీత్కారాలు పొందిన ఆయన శిష్యులు రాజుగారి దగ్గరికి వెళ్ళి తగిన శిక్ష పొందాలని గురువుగారికి చెప్పకుండా వారి ఇంటి నుండి బయలుదేరి రాజధాని చేరి రాజభవనంలోకి వెళ్ళారు.

సరిగ్గా అప్పుడే చంద్రలేఖ మనస్సుమారి, రాజుగారైన చంద్రసేనుడిని వివాహం ఆడాలని నిర్ణయించుకొని, ఆ క్షణమే పెళ్ళి జరగాలని పట్టు పట్టింది.

ఇప్పటికిప్పుడు పెళ్ళి చేయటానికి పురోహితుడు ఎలా దొరుకుతాడా అని చింతిస్తున్న చంద్రసేనుడి దగ్గరికి వచ్చారు పరమానందయ్య గారి శిష్యులు.



వాళ్ళని చూడగానే చంద్రసేనుడి కళ్ళు ఆనందంతో మెరిసాయి... ఓయీ అయ్యలారా! మీ గురువుగారైన పరమానందయ్యగారు మీతో బాటు రాలేదేం అన్నాడు ఆత్రుతగా, దానికి పరమానందయ్యగారి శిష్యులు, ఓ



రాజా! మా వల్ల గురువుగారికి ఎంతో చెడ్డపేరు వచ్చింది. ఆత్మహత్య చేసుకుందామన్నా మాకు చావు రావటం లేదు. నీవైనా మమ్మల్ని కారాగారంలో వేసి శిక్షించు అన్నారు సంయుక్తంగా.

చంద్రసేనుడికి అప్పటికే పరమానందయ్యగారి శిష్యులు అమాయకులు, తెలివితక్కువ వాళ్ళు అని తెలుసు. దాంతో ఆయన ఇలా అన్నాడు. అయ్యలారా! మిమ్మల్ని తప్పక శిక్షిస్తాను. కానీ మీరు నాకొక పని చేసి పెట్టాలి. వెంటనే శాస్త్రి, ఓ తప్పకుండా చేస్తాం, ఏం చెయ్యాలో వెంటనే సెలవివ్వండి అన్నాడు.

అప్పుడు చంద్రసేనుడు, అయ్యలారా! నేను, చంద్రలేఖ అనే సుందరిని వివాహమాడాలని నిర్ణయించుకున్నాను. మా వివాహం ఈ క్షణమే జరగాలని చంద్రలేఖ పట్టుపడుతున్నది. మీరు దయచేసి మా ఇద్దరికీ వివాహం జరిపించాలి .... జరిపిస్తారా....అన్నాడు.

రాజుగారి మాటలు విన్న శాస్త్రి, ఓ! అలాగే... మాకు పెళ్ళిళ్ళు చేయటం వచ్చు అన్నాడు. ఇక చక, చక పెళ్ళి ఏర్పాట్లు జరిగాయి. చంద్రలేఖను రాజమాతే స్వయంగా పెళ్ళికూతుర్ని చేసింది.